ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 30 సెప్టెంబరు 2025 | 5






రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో భక్తులు


నిడదవోలులో కోటసత్తెమ్మకు చిన్నారుల పూజలు

మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం అమ్మవార్లకు సరస్వతిదేవి అలంకారం చేశారు.. చిన్నారులు పెద్ద ఎత్తున పూజలు చేశారు.. జ్ఞానం ప్రసాదించమని వేడుకున్నారు.. బిక్కవోలులో అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేశారు. నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాజమహేంద్రవరం దేవిచౌక్ సోమవారం రాత్రి భక్తులతో నిండిపోయింది. - బిక్కవోలు

ఆటోమేటిక్‌గా!

4న డ్రైవర్ల ఖాతాల్లో సొమ్ములు



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు పోటెత్తాయి. ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సాయం కోరుతూ ఆటోడ్రైవర్లు, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు పెద్ద ఎత్తున దరఖాస్తు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తాము వాహన యజమానులం అంటూ 36,360 మంది ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేయగా 35,543 మంది అర్హులుగా గుర్తించారు.అయితే పథకం కింద అర్హత సాధించని వారు తిరిగి దరఖాస్తు చేస్తే విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వచ్చే నెల 4న వీరందరికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో రూ.53.31 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించనుంది.ఇప్పటికే ఆటోలపై ప్రభుత్వం హరిత పన్ను తగ్గించడంతో ఉపశమనం కలగ్గా..ఆర్థిక సాయం అందిస్తుండడంపై ఆటోవాలాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులు 35,543 మంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36,360 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా కాకినాడ జిల్లాలో 14,722 మంది దరఖాస్తు చేసుకోగా 14,412 మందిని అర్హులుగా నిర్ధారించింది. 248 మంది దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా లేక తిరస్కరించింది. మరో 62 దరఖాస్తులను హోల్డ్ చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 13,147 మంది దరఖాస్తు చేసుకోగా 12,894 మందిని అర్హులుగా తేల్చింది. 172 దరఖాస్తులు తిరస్కరించింది. మరో 81 దరఖాస్తులను హోల్డ్‌లో ఉంచింది.కోనసీమ జిల్లాలో స్వల్పంగా 8,491 దరఖాస్తులే దాఖల య్యాయి. 8,237 దరఖాస్తులకు అధికారులు ఆమోదముద్ర వేశారు. 179 దరఖాస్తులను తిరస్కరించగా 75 హోల్డ్‌లో ఉంచారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 35,543 మంది దరఖాస్తులకు ఆమోదముద్ర లభించింది.కేవలం 218 దరఖాస్తులను మాత్రమే ఆన్‌హోల్డ్‌లో ఉంచగా 599 మందిని తిరస్కరించారు.అర్హులైన లబ్ధిదారులకు అక్టోబరు 4న ప్రభుత్వం నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది.రూ.53.31 కోట్లు ఖర్చు కానుంది.

ఆటోవాలాలకు సాయం

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించింది. దీంతో తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని కార్మికులు ప్రభుత్వా నికి విన్నవించారు.పలుచోట్ల ఆందోళనలు చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రభుత్వం వరం ప్రకటించింది. అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు సీఎం చంద్రబాబు ఇటీవల అనంతపురం బహిరంగ సభలో ప్రకటించారు. దీంతో ఆటో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. పథకం పరిధిలోకి తమను కూడా తీసుకురావాలని క్యాబ్,మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.పథకానికి ఆటో డ్రైవర్ల సేవలో అని నామకరణం చేయడంతో రూ.15 వేలు అందాలంటే ఆటో,క్యాబ్ యజమాని స్వయంగా డ్రైవర్ అయి ఉండాలని పేర్కొంది.గూడ్స్ వాహనాలకు పథకం వర్తించదని స్పష్టం చేసింది.

వచ్చారు..పన్ను తగ్గించారు..

గత వైసీపీ సర్కారు హరిత పన్ను పేరుతో ఆటోవాలాలను నిలువునా దోచేసింది.జగన్ సర్కారు రాకమునుపు బైక్ నుంచి లారీ, టిప్పర్, ఆటో, స్కూల్ బస్సుల వరకు వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి రూ.200 వరకు మాత్రమే పన్ను కట్టించుకునేవారు. 2019లో జగన్ ప్రభు త్వం వచ్చాక అన్ని రకాల వాహనాలపై హరిత పన్ను భారీగా పెంచేసి 2022 జనవరి 1 నుంచి అమలు చేసింది. అప్పటి వరకు ఉన్న రూ.200 పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసింది. వాహనం కొనుగోలు చేసిన తేదీ నుంచి త్రైమాసికాల పన్ను విడతల వారీగా పెంచేసింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆటోవాలాలు నష్టపోయారు.పెరిగిన పన్ను భారం భరించలేక ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరితపన్ను దోపిడీపై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు పన్ను తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్నారు.

- ఒక్కొక్కరికి రూ.15 వేలు
- 36,360 దరఖాస్తులు
- కాకినాడలో 14,722
- తూర్పుగోదావరిలో 13,147
- కోనసీమలో 8,491
- 35,543 దరఖాస్తులకు ఆమోదం
- 172 దరఖాస్తులే తిరస్కరణ
- 218 మాత్రమే ఆన్‌హోల్డ్
- ఐదు రోజుల్లో నగదు జమ
- మొత్తం రూ.53.31 కోట్లు
- ఆటోలకు తగ్గిన హరిత పన్ను
- నాడు ఆటోడ్రైవర్లకు మోసం

నాడు ఇలా...

గత వైసీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను నిలు వునా మోసం చేసింది. వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయాన్ని అందించినట్టు అప్పట్లో గొప్పలు చెప్పింది.తీరా లబ్ధిదా రులను నిలువునా కోసేసి కేవలం కొందరికే పథ కం అమలు చేసింది.ఇలా ఆటో కార్మికులకు రూ.10 వేలు అందించి వారం వ్యవధిలోనే ఆర్టీవోలను రంగంలోకి దించి రకరకాల ఫైన్‌లు విధించింది. ఒక రకంగా చెప్పా లంటే ఆ చేత్తో రూ.10వేలు ఇచ్చి ఈ చేత్తో అందులో సగం వరకు లాగేసుకుంది.దీంతో ఆటోవాలాలు ఇబ్బం దులు పడ్డారు. అప్పట్లో వాహనమిత్ర పథకాన్ని కొంత కాలమే అమలుచేసి ఆ తర్వాత గాలికి వదిలేశారు.

నేడు ఇలా...

ప్రస్తుతం సీఎం చంద్రబాబు పథకం కింద అందించే సాయాన్ని రూ.15 వేలకు పెంచారు. ఎలాంటి కోతలు లేకుండా అర్హులను లబ్ధిదా రుల జాబితాలో చేర్చాలని ఆదేశించారు. పథకం నిబంధ నలను సైతం సడలించారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు పథకానికి దరఖాస్తులు చేసుకోగా, 90 శాతానికి పైగా దరఖాస్తులను ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు వేయకుండా ఆమోదించింది.


పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అర్జీలపై తప్పుడు నివేదికలు వద్దు

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్జీలు స్వీకరించడం వాటిని పరిష్కరించడంతో సరికాదని.. వారు సంతృప్తి చెందడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో స్వయంగా 160 అర్జీలను స్వీకరించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.కొంత మంది అధికారులు అర్జీదారులను సంప్రదించకుండానే అర్జీలను పరిష్కరించి నివేదికలివ్వడం తప్పు అని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల, సచివాలయాల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు జిల్లా స్థాయికి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు వంటి సాధారణ సమస్యలకు స్థానికంగానే పరిష్కారం చూపాలన్నారు. నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీల్లో కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో జ్వరాలు అధికంగా నమోదవుతున్న ప్రాంతాల్లో బోరు నీటిని పరీక్షించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జేసీ వై.మేఘస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి, డీఎస్పీ భవ్యకిషోర్,స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, ఎస్.భాగ్యలక్ష్మి, వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ సుధాకర్, డీఎల్‌డీవో శ్లీవారెడ్డి, పి.వీణాదేవి పాల్గొన్నారు.

న్యాయం చేయండమ్మా..

కడియం మండలం వేమగిరి తోటకు చెందిన కుడుపూడి అశ్విని తనకు న్యాయం చేయాలని వేడుకుంది. తన భర్త కుడుపూడి శ్రీనివాస్ నాలుగు నెలల కిందట డ్రైవింగ్‌కి కారులో ఒడిస్సా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించారని.. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపింది.నా భర్త మరణించాక గడపదాటడానికి పుట్టినిట్టింకి వెళ్లి తిరిగొచ్చే సరికి మా అత్తమామలు, మరిది, ఆడబ డుచు తాము అద్దెకు ఉన్న ఇంట్లోని సామగ్రి వారింటికి తీసుకునిపోయారని వాపోయింది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కొన్ని సామాన్లు ఇచ్చారని..కానీ తన భర్తకు సంబంధించిన ఇన్సూరెన్స్ తనకు చెందకుండా ప్రయత్నిస్తున్నారని ఎఫ్ఎంసీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తన ను బయటకి గేంటేసి దారుణంగా అవమానించారని తెలిపింది. దయచేసి తనకు న్యా యం చేయాలని కోరింది.దీనిపై స్పందించిన కలెక్టర్ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 22 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్(మీకోసం) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా మాట్లాడి 22 అర్జీలను స్వీకరించారు. చట్ట పరిధిలో తదుపరి చర్యలు త్వరితగతిన తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

గంటలోనే వరదెత్తింది

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా గోదారి


కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి వరద

రాజమహేంద్రవరం/కొవ్వూరు,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంటల వ్యవధిలోనే గోదావరి ఉధృతంగా మారింది.ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు జారీ చేసిన మొదటి ప్రమాద హెచ్చరికను సోమవారం సాయంత్రం 6 గంటలకు ఉపసంహరించుకు న్నారు. కేవలం ఒక్క గంటలోనే రాత్రి 7 గంటల నుంచి మళ్లీ పెరుగుదల కనిపించింది. ఎగువున కురిసిన వర్షాల కారణంగా భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతోంది.ఆ ప్రభావం అఖండ గోదావరిపై పడుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు అధికంగా వచ్చి చేరడంతో గోదావరికి వరద పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తుంది.ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 7 గంటలకు నీటిమట్టం 11.70 అడుగులుగా ఉంది. ఇది 11.75కి చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ఈసారి ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు అధికారుల అంచనా. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ప్రధాన స్నానఘట్టాలు సోమవారం తెరుకునే లోపునే మళ్లీ వరదొచ్చిపడింది. నదీ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో నదిలో ఎవరూ దిగకుండా పోలీస్,ఇరిగేషన్ అధికారులు స్నానఘట్టాల వద్ద వెదురుకర్రలతో బారీకేడ్లు ఏర్పాటుచేసి అడ్డంగా క్లాత్‌ను కట్టారు. దసరా పండుగను పురస్కరించుకుని కొవ్వూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా భవానీ మాలలు, అయ్యప్పమాలలు ధరించడంతో కొంతమంది బారీకేడ్లను తొలగించి వరద గోదావరిలో ప్రమాదకరంగా స్నానాలు ఆచరిస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో..

కలెక్టరేట్ కంట్రోలు రూమ్ 8977935611
రాజమండ్రి ఆర్డీవో ఆఫీస్ 0883-2442344
కొవ్వూరు ఆర్డీవో ఆఫీస్ 79953 67797
టోల్ ఫ్రీ నెంబర్లు 1070, 112,
1800-425-0101, 8333905022

ప్రజా రక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి : జేసీ


రాజమహేంద్రవరంలో అడ్డుకట్ట

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జేసీ వై.మేఘస్వరూప్ తెలిపారు. గోదావరి వరద పరిస్థితిపై వివిధ శాఖల అధికా రులతో సమీక్షించారు. రెవెన్యూ అధికారులు బాధితులను సురక్షిత ప్రదేశాలకు తరలించి, సహాయక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, గస్తీ పెంచాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు బ్యారేజి పర్యవేక్షణలో ఉండి, నీటిమట్టాల వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ,ఆర్ఎంసీ అధికారులు ఘాట్ల వద్ద బారి కేడింగ్ ఏర్పాటు రోజంతా పర్యవేక్షించాలని చెప్పారు.అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.


అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లికి వైద్యుల వినతి

పీహెచ్‌సీల్లో ఓపీ బంద్

బిక్కవోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో సోమవారం ఓపీ సేవలు బంద్ చేశారు. రాష్ట్ర పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ పిలుపు మేరకు తమ డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్ చేశారు. అనపర్తి నియోజకవర్గం పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో నెం 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, సమయ నిర్ధారితమైన పదోన్నతుల కల్పించాలని, ట్రైబల్, 104 సంచార చికిత్స అల వెన్స్‌లు అందించాలని, నోషనల్ ఇన్‌క్రిమెంట్‌లు అందించాలని డిమాండ్ చేశారు. బిక్కవోలు, కొంకుదురు వైద్యులు దుర్గాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలిగిన సచివాలయ కార్యదర్శులు

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సచివాలయ కార్యదర్శులు వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలిగారు. సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కొవ్వూరు పట్టణ అధ్యక్షులు ఎస్.కృష్ణభగవాన్ మాట్లాడుతూ ఏపీవీడబ్ల్యుఎస్ఈ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ పిలుపు మేరకు సోమవారం సచివాలయ కార్యదర్శులు బ్యాంకుల నుంచి పెన్షన్ అమౌంట్ డ్రా చేసుకుని వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలగడం జరిగిందన్నారు.ప్రభుత్వ ఉద్యోగులుగా మాకు అప్పగించిన విధులు నిర్వర్తించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వలంటీర్ విధులు మాకు అప్పగించడం బాధాకరమన్నారు. ఇంటింటికి తిరిగి క్యాంపెయినింగ్, డోర్ టు డోర్ సర్వేలు అప్పగించవద్దని నిరసన పోరాటం కొనసాగుతుందన్నారు. వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలగినా ప్రతీరోజు ఉదయం 10-30 నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనే ఉంటామన్నారు. అక్టోబరు 1న పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. మా డిమాండ్ల సాధనకు తుది వరకూ పోరాటం చేస్తామని తెలిపారు.

ది 'సైట్' చేస్తాయ్...






ఈదురుగాలుల తీవ్రతను కొలిచే సాధనం

ఒక్కోసారి వాతావరణ మార్పులు ఆశ్చర్యపరుస్తుంటాయి. ఏ సమయంలో ఎండ కాస్తుందో... ఎప్పుడు వర్షం పడుతుందో... తెలియని పరిస్థితులు నెలకొంటాయి. వింతైన, విచిత్రమైన వాతావరణం ఒక్కోసారి ఆలోచనలో పడేస్తుంది. ఒక ప్రాంతంలో వర్షం కురిస్తే.. మరో ప్రాంతంలో ఎండ కాస్తుంది. ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన వాతావరణం ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ఇలాంటి సమయంలో ఏ ప్రాంతంలో ఏయే వాతావరణ పరిస్థితులు ఉన్నాయో తెలుసుకోవాలంటే వాతావరణ శాఖకు సంబంధించిన వెబ్‌సైట్లను ఆశ్రయించాల్సిందే. వాటి ద్వారా మీ ప్రాంతంలో వర్షం పడుతుందా? పిడుగులు పడతాయా? గాలులు వీస్తాయా? ఎండ కాస్తుందా? అనే విషయాలను అంచనా వేయొచ్చు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల (ఏడబ్ల్యుఎస్) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం వేరుగా వాతావరణ అంచనాలు జారీ చేస్తోంది. దేశ్‌వెదర్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫోర్‌కాస్ట్‌పై క్లిక్ చేసి.. 24 గంటల్లో కురిసిన వర్షపాతం, ఉష్ణోగ్రతలు కూడా తెలుస్తాయి. పిడుగులు, భారీ వర్షాలు పడే పరిస్థితులుంటే నేరుగా మొబైల్స్‌కే మెసేజ్ వస్తోంది. విశాఖలోని తుఫాను హెచ్చరికల కేంద్రం సామాజిక మాధ్యమాల్లో సమాచారం పెడుతూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది.





ఈదురుగాలుల హెచ్చరికలు ఇక్కడ...

ఐఎండీకి చెందిన మౌసమ్.ఐఎండీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో హెచ్చరికలు (వార్నింగ్స్), నౌకాస్ట్‌లోకి వెళ్లి.. సబ్ డివిజన్, జిల్లాల వారీగా సమాచారం తెలుసుకోవచ్చు. పిడుగులు, వర్షాలు, ఈదురుగాలులు తదితర హెచ్చరికలు ఉంటే అక్కడ కనిపిస్తాయి. పచ్చ అయితే సాధారణం, పసుపు రంగు ఉంటే అప్రమత్తంగా ఉండాలని, ఆరెంజ్ అయితే భారీ వర్షాలు, వరద ముప్పు ఉందని, 'ఎరుపు' అయితే చర్యలు తీసుకోవాలని అర్థం వస్తుంది.

ప్రాంతాలను బట్టి ప్రకృతి సమాచారం

దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణ ప్రాంతాల కోసం ఐఎండీ ప్రత్యేకంగా అంచనాలు జారీ చేస్తోంది. 'ఇంటర్నేషనల్.ఐఎండీ.జీఓవీ.ఇన్/పేజీస్/సిటీ-వెదర్-మెయిన్-మౌసమ్.పీహెచ్‌పీ' వెబ్‌సైట్‌లోకి వెళ్లి కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం... ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. పక్కన సెర్చ్‌బార్‌లో కూడా అదే ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. కాకినాడ జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, తుని, జగ్గంపేట... ఇలా ప్రాంతాల వారీగా అంచనాలు తెలుసుకోవచ్చు.

పిన్‌కోడ్‌తో...

పిన్‌కోడ్, గ్రామ పంచాయతీలను ఎంపిక చేసుకుని 'మౌసమ్‌గ్రామ్.ఐఎండీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆయా ప్రాంతాల్లో వాతావరణ హెచ్చరికలను తెలుసుకోవచ్చు. వాతావరణ హెచ్చరికలు ఏ సమయానికి ఎంత వర్షం కురుస్తుంది, ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గులు, మేఘాలు, గాలుల వేగం తదితరాలు తెలుసుకోవచ్చు.





- ఒక్క క్లిక్‌తో పూర్తి వాతావరణ సమాచారం
- అందుబాటులో పలు రకాల వెబ్‌సైట్లు
- కాకినాడ పీఆర్ కళాశాలలో జిల్లా సమాచారం
- పిన్‌కోడ్ ఆధారంగానూ వివరాలు లభ్యం

పిడుగుల సమాచారమిక్కడ...

పిడుగుల సమాచారం తెలుసుకోవాలంటే కచ్చితంగా 'దామిని' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మనకు సమీపంలో 20 కి.మీ. నుంచి 40 కి.మీ. పరిధిలో పిడుగు పడే ఆస్కారముంటే ఈ యాప్ ముందుగానే అప్రమత్తం చేస్తుంది. కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్లు నమోదు చేసి వారిని అప్రమత్తం చేసే అవకాశం ఉంది.



వర్షపాతాన్ని నమోదు చేసే రెయిన్ గేజ్

కాకినాడ పీఆర్ కళాశాలలో...

కాకినాడ నగరంలోని పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో భారత ప్రభుత్వ భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ భారత వాతావరణ విభాగం నేతృత్వంలో వాతావరణ పరిశీలన కేంద్రం ఉంది. ఇందులో వాతావరణ మార్పులు నమోదు చేస్తుంటారు. ఇక్కడ థర్మోమీటర్, థర్మోగ్రాఫ్, హైగ్రో గ్రాఫ్ ఉన్నాయి. వీటిద్వారా ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం ఎంత అనేది నమోదు చేస్తారు. వర్షపాతాన్ని నమోదు చేసే రెయిన్‌గేజ్‌లను కూడా ఇక్కడ ఏర్పాటుచేశారు. తద్వారా వర్షం ఎంత మేర కురిసిందో తెలుసుకుంటారు. అలాగే గాలి వాటాన్ని కూడా పరిశీలిస్తారు. ఎటువైపు గాలి బాగా వీస్తోంది, ఎంత మేర గాలులు వీస్తున్నాయి వంటి వివరాలనూ నమోదు చేస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ నమోదు చేస్తున్న సమాచారాన్ని అమరావతిలోని ఐఎండీ కార్యాలయాలకు పంపుతారు. అక్కడి నుంచి వాతావరణ సమాచారం జిల్లా కేంద్రాలకు తిరిగి వస్తుంది.



ఉష్ణోగ్రతల హెచ్చు తగ్గులను నమోదు చేసే థర్మోగ్రాఫ్

వీధి వ్యాపారులకు ఆసరా



పట్టణాల్లో రోడ్డుపక్క వ్యాపారులు చేసుకునే తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రధానమంత్రి అత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి యోజన) పథకం ద్వారా రుణ పరిమితి పెంచి వారికి ఆర్థిక ప్రయోజనం కల్పించేందుకు పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో లోక్ కల్యాణ్ మేళాలు నిర్వహిస్తున్నారు. అక్టోబరు 2 వరకు సాగే ఈ మేళాల్లో వివిధ అంశాలపై మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు.

- పీఎం స్వనిధి యోజన పథకంలో చిరు వ్యాపారులకు రుణాలు
- 2029 వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో వ్యాపారుల గుర్తింపు
- 'లోక్ కల్యాణ్ మేళా' పేరిట అవగాహన సదస్సులు

(మండపేట-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం 2020 జూన్‌లో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి యోజన) పథకంలో ఇప్పటి వరకు మూడు విడతల్లో అనేక మంది తక్కువ వడ్డీకే రుణాలు తీసుకుని తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుని ఉపాధి పొందుతున్నారు. కేంద్రం ఈ రుణాల పంపిణీని నిలిపివేయడంతో చిరు వ్యాపారులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో కేంద్రం ఈ పథకాన్ని పునః ప్రారంభించింది. దీనిని 2029 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఇందులో భాగంగా వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ సర్వే ద్వారా నూతనంగా వీధి వ్యాపారులను నమోదు చేస్తున్నారు. గతంలో రుణాలు మంజూరై నిధులు విడుదల కాని వారిని గుర్తించి వారికి రుణాలు అందేలా చర్యలు చేపట్టారు.

ఒకే వ్యాపారం చేసే ఐదుగురిని గుర్తించి వారిని సంఘంగా ఏర్పాటుచేసి వారి వ్యాపార అభివృద్ధికి రుణాలు అందిస్తారు. దీంతో ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

తొలి విడతలో రూ.15వేలు ఇస్తారు. వాటిని సక్రమంగా చెల్లిస్తే రెండో విడతలో రూ.25వేలు, మూడో విడతలో రూ.50వేలు అందిస్తారు.

ప్రయోజనం ఇదీ...

ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా విడతల వారీగా రుణాలు మంజూరు చేస్తారు. డిజిటల్ చెల్లింపులు ఎలా చేయాలి, ఎఫ్ఎస్ఎస్ఏఐ సహకారంతో వీధి వ్యాపారులకు ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ ఇస్తారు. వీధి విక్రయదారులకు, వారి కుటుంబీకులకు ఎనిమిది అంశాల్లో ప్రభుత్వ పథకాల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తారు. వ్యాపారులకు రూ.30వేల పరిమితితో రూ.50వేలు విలువచేసే క్రెడిట్ కార్డు జారీ చేస్తారు.

వీధి వ్యాపారులను గుర్తించి వారి కుటుంబ పూర్తి వివరాలను అంతర్జాలంలో నమోదు చేస్తాం. ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం. అర్హులందరికీ నిబంధనల మేరకు రుణాలు అందిస్తాము.

సుజాత, మెప్మా విభాగ అధికారి, మండపేట

ఖోఖో సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా పట్టాభిరామం, కార్యదర్శిగా శ్రీనివాసకుమార్



ఎన్నికైన ఖోఖో సంఘ నూతన కార్యవర్గం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని కుడిపూడి రామ్‌కుమార్ క్రీడా భవన్‌లో సోమవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. తొలుత కార్యవర్గ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికకు పరిశీలకులుగా రాష్ట్ర ఖోఖో సంఘ అధ్యక్షుడు టీఎస్ ఆర్కే ప్రసాద్ జిల్లా ఒలింపిక్ సంఘం నుంచి వి.రవిరాజు, డీఎస్ఏ నుంచి కేవెల్ పాపారావు ప్రత్యేక హోదాలో హాజరయ్యారు.అడ్వకేట్ ఎం.సత్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. అధ్యక్షుడిగా కె.పట్టాభిరామం, కార్యదర్శిగా ఎం.శ్రీనివాసకుమార్, కోశాధికారిగా కె.రాంబాబు, ఉపాధ్యక్షులుగా ఎల్.గోవిందరాజులు, కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా మాచరరావు, ఇబ్రహీం, ఈసీ సభ్యులుగా సూర్యనారాయణ, సుధాకర్ ఎన్నికయ్యారు.మెగా డీఎస్సీలో క్రీడా కోటాలో వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సాంకేతిక సలహాదారుడు సాయిప్రసాద్, కార్యవర్గ సభ్యులు రంగారావు, బంగారాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి వీఎం రావు, కోశాధికారి నాగు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అక్టోబరు 3నుంచి 10వ తేదీ వరకు వారికి కేటాయించిన కేంద్రాల్లో ఇండక్షన్ ట్రైనింగ్ నిర్వహిస్తామని కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా జరిగే ఈ శిక్షణకు ఎంపికైన ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. శిక్షణ పూర్తయి తర్వాతే పాఠశాలల్లో చేరేందుకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామన్నారు. అభ్యర్థులు శిక్షణా సమయంలో అవసరమయ్యే వస్తువులు, అనారోగ్యంతో ఉన్నవారు సరిపడా మందులు తెచ్చుకోవాలని సూచించారు. దుప్పట్లు, ఇతర వ్యక్తిగత సామగ్రి, ఉదయం జాగింగ్ నిమిత్తం రన్నింగ్ షూస్, ఆండ్రాయిడ్ మొబైల్ తెచ్చుకోవాలని, ఫార్మల్ డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు.

ట్రైనింగ్ క్యాంప్ చిరునామా, కేటాయించిన ఉపాధ్యాయులు

- సాయిమాధవి ఇంజనీరింగ్ కళాశాల, మల్లంపూడి, రాజానగరం మండలం, తూర్పు గోదావరి జిల్లా
  స్కూల్ అసిస్టెంట్-తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృతం
- బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల, ఓడలరేవు, అల్లవరం మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా
  స్కూల్ అసిస్టెంట్-గణితం, పీఎస్, బీఎస్
- ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, తూర్పుగోనగూడెం, రాజానగరం మండలం, తూర్పు గోదావరి జిల్లా
  స్కూల్ అసిస్టెంట్-ఫిజికల్ ఎడ్యుకేషన్
- జీఎస్ఎల్ డెంటల్ కళాశాల, రాజానగరం, తూర్పు గోదావరి జిల్లా
  స్కూల్ అసిస్టెంట్-సోషల్ స్టడీస్
- ఆర్ఐఎఫ్‌టీ ఇంజనీరింగ్ కళాశాల, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా
  ఎస్జీటీ
- సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాల, కొండ గుంటూరు, రాజవోలు రోడ్డు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా
  ఎస్జీటీ
- జీఎస్ఎల్ డెంటల్ కళాశాల, రాజానగరం, తూర్పు గోదావరి జిల్లా
  పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులు

జాతీయ సమైక్యతను పెంపొందించుకోవాలి



సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి దుర్గేష్

- మంత్రి కందుల దుర్గేష్
- ఎన్‌సీసీ జాతీయ సమైక్యత ప్రత్యేక శిబిరం
- క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శనలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే జాతీయ సమైక్యతను పెంపొందించుకుని సోదర భావంతో మెలగాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ జాతీయ సమైక్యత ప్రత్యేక శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పాఠశాలల్లో, కళాశాల స్థాయిలో విద్యార్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ తదితర దేశ రక్షణకు సంబంధించిన సర్వీసులలో శిక్షణ అందించడం గొప్ప అవకాశంగా భావించాలన్నారు. ఇందులో చేరిన ప్రతీ ఒక్కరికీ భవిష్యత్‌లో అద్భుతమైన అవకాశాలు ఉంటాయని చెప్పారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో యువతకు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించిందని, ఈ క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన భారతదేశం తమ సైనిక సత్తాను ప్రపంచానికి చూపిందని మంత్రి దుర్గేష్ అన్నారు. తాను పాఠశాల దశలో ఉన్నప్పుడు ఎన్‌సీసీలో చేరానని తనకు క్రమశిక్షణ అక్కడే అలవడిందన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్ఎం అగర్వాల్, కమాండింగ్ అధికారి కల్నల్ హెచ్ఎస్ మాణిక్ పాల్గొన్నారు.

బీసీసీఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫెసిలిటీస్ కమిటీ సభ్యుడిగా ఎంపీ సతీష్‌బాబు



కాకినాడ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫెసిలిటీస్ కమిటీ సభ్యుడిగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నియమితులయ్యారు. ముంబైలో ఆదివారం జరిగిన బీసీసీఐ 94వ వార్షిక సాధారణ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆయన్ను నియమించారు. ఈ కమిటీ దేశ వ్యాప్తంగా క్రికెట్ మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి, పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. స్టేడియాల నిర్మాణం, ఆధునికీకరణ, శిక్షణా కేంద్రాల ఏర్పాటు, పిచ్‌లు, గ్రౌండ్ల సామర్థ్యం,నిధుల కేటాయింపు, ప్రాజెక్టుల పర్యవేక్షణ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల సాధన వంటి బాధ్యతలు ఈ కమిటీ పరిధిలోకి వస్తాయి. సతీష్‌బాబు నియామకంతో ఆంధ్రప్రదేశ్‌కు అనేక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. కొత్త స్టేడియాల నిర్మాణం, ప్రస్తుత మున్న గ్రౌండ్ల ఆధునికీకరణ, శిక్షణా సదుపాయాల కల్పన, అంతర్జాతీయ పోటీలకు ఆతిథ్యం ఇవ్వగల వేదికలు అభివృద్ధి చెందే అవకాశాలు మరింతగా పెరగవచ్చు. ఈ సందర్భంగా సానా సతీష్‌బాబు నియామకం పట్ల తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నక్కా వెంకటేష్, రంజీ మాజీ ప్లేయర్ రఫీ అహ్మద్ కిద్వాయ్, తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా త్రికోటి మహా సరస్వతి పూజ



సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు(ఇన్‌సెట్లో) సరస్వతి అలంకరణలో అమ్మవారు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ పరిధిలోని రమణయ్యపేటలో శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో త్రికోటి మహా సరస్వతి పూజ, వందకోట్ల లలితా సహస్ర విరాట్ పారాయణ సోమవారం ఘనంగా జరిగాయి. స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ మహాశక్తి యాగం ఎనిమిదో రోజుకు చేరింది. శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారిని సరస్వతిదేవిగా విశేష అలంకారం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మేధాసూక్త, సరస్వతి హోమాలు నిర్వహించారు. స్వామిజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ.... సంకల్పం గొప్పదైతే ఏదైనా సాధించవచ్చని, లక్ష్యాన్ని సాధించే వరకు కృషి చేయాలన్నారు. ముందు మనం లక్ష్యం పెట్టుకుని ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తే ఫలితం వాటంతట అదే వస్తుందన్నారు. నమ్మకం దృఢంగా ఉండాలన్నారు. దైవాన్ని గట్టిగా పట్టుకున్నప్పుడే జీవితంలో విజయవంతం అవుతామన్నారు. ఆత్మవిశ్వాసం, ధృడమైన నమ్మకం, దైవాన్ని నమ్మడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. జీవితంలో మనకోసం నిలబడే వాళ్లు ముగ్గురు అని అన్నారు. మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ... వీళ్లను మరచిపోరాదని స్వామి పరిపూర్ణానంద హితవు పలికారు. సరస్వతి పూజకు కాకినాడ జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, మహిళలు కలిపి సుమారు 40 వేలకు పైగా హాజరైనట్టు నిర్వాహకులు చెప్పారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

సరస్వతి అలంకరణలో రత్నగిరి దుర్గలు

అన్నవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రత్నగిరి దుర్గలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గలు సోమవారం సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యాబుద్ధులు ప్రసాదించే దేవతలుగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. మూల నక్షత్రం సందర్భంగా ఆలయార్చకులు కనక దుర్గ ఆలయంలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వనదుర్గమ్మ, తలుపులమ్మ తల్లి

మహాచండీ దేవిగా తలుపులమ్మ తల్లి

తుని రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో తలుపులమ్మ తల్లి సోమవారం అమ్మవారు శ్రీ మహాచండీ దేవిగా భక్తులను అనుగ్రహించడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

వీరేశ్వరస్వామి ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వీరేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు విజ్ఞప్తి చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. సోమవారం జరిగిన వీరేశ్వరస్వామి ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన విచ్చేశారు. నూతన ట్రస్టు బోర్డు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆలయ విశిష్టతను వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ నూతన ట్రస్టు బోర్డు సభ్యులు దాట్ల రామకృష్ణంరాజు, త్సవటపల్లి నాగేంద్రరావు, పెద్దింటి మారుతీశ్రీవాణి, పెన్మెత్స రామరాజు, కర్రి చంద్రశేఖర్, విత్తనాల సత్యనారాయణ, గంగుల జయలక్ష్మి, గొల్లవిల్లి సునీత, పాటి సీతామహాలక్ష్మి, మద్దాల వెంకటేశ్వరరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పీవీవీ సుబ్బారావులతో ప్రమాణం చేయించారు. అనంతరం చైర్మన్‌గా దాట్ల రామకృష్ణంరాజును సభ్యులు ఎన్నుకున్నారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, కాకర్లపూడి బుజ్జి, జంపన బాబు, నడింపల్లి సూర్యవర్మ, ధూళిపూడి చక్రం, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, పొద్దోకు బాలు,చెల్లి అశోక్, లంకలపల్లి మునిరాజు, చిక్కాల శ్రీనివాస్, పెంట రవిప్రసాద్, చిలువూరి సుబ్బరాజు, చోడిశెట్టి నాగు పాల్గొన్నారు.

అమలాపురంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

14 రోజుల రిమాండ్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సావరం బైపాస్ రోడ్డులోని కొబ్బరి తోటల్లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీఐ వీరబాబు ఆధ్వర్యంలో దాడి చేశారు. అమలాపురం గారపాటివీధికి చెందిన రాయుపురెడ్డి దత్తతేజ అలియాస్ తేజ, పశ్చిమబెంగాల్‌కు చెందిన రాహుల్‌హజ్రా, ఇందుపల్లి భట్లపాలెం ప్రాంతానికి చెందిన ధర్మాడి వంశీలను అరెస్టు చేశారు. వారు విశాఖ అటవీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి అమలాపురంలో విక్రయించేందుకు ప్రయత్నించగా సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ కేఎం జోషి సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి నుంచి 2 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లు, 2 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్ విధించారని, వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు.

కారులో దర్జాగా గంజాయి రవాణా

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 383.820 కిలోల గంజాయి, ఇన్నోవా క్రిస్టా కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడ క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవా కారుకు ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని స్టిక్కర్ వేసుకుని దర్జాగా అధికారుల వలే తిరుగుతూ గంజాయి రవాణా సాగిస్తూ అనుమానంతో కారు ఆపిన వారిని ఢీకొని అడ్డు అదుపులేని వేగంతో వెళ్తూ చివరికి కాకినాడ జిల్లా పోలీసులకు చిక్కారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి 383.820 కిలోల గంజాయి, ఇన్నోవా క్రిష్టా కారును స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురి కోసం గాలింపు చేపట్టారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకర్లకు ఎస్పీ జిబిందుమాధవ్ నిందితుల వివరాలు తెలిపారు.

అసలేం జరిగిందంటే..

ఈ నెల 23న ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అనే బోర్డు ఉన్న ఇన్నోవా క్రిష్టా తెలుపు రంగు కారులో ఇద్దరు పురుషులు, ఒక మహిళా ప్రయాణం చేశారు. విశాఖపట్నం, భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు, సిబ్బంది అనుమానంతో కారును ఆపగా డ్రైవరు కారును వేగంగా నడిపి టోల్‌ప్లాజా సిబ్బందిని బలంగా ఢీకొని గాయపర్చి కాకినాడ వైపు వెళ్లిపోగా కాకినాడ జిల్లా పోలీసులకు అక్కడ సిబ్బంది సమాచారం అందించారు. అనంతరం ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ టి.రఘునంధన్‌రావు సిబ్బందితో కలిసి కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేశారు. టోల్‌ప్లాజా వద్ద కారును ఆపే క్రమంలో ఇన్నోవా డ్రైవర్ వెనుకకు తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న లారీని ఢీకొని పారిపోతుండగా కారు అద్దాలు పగిలి డ్రైవర్‌ను కారు నుంచి కిందకి దింపేందుకు ప్రయత్నం చేయగా డ్రైవర్ ఫోన్ కిందపడిపోయింది. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే డ్రైవరు తీవ్రంగా ప్రతిఘటించి కారు నుంచి దిగకుండా ప్రత్తిపాడు వైపు కారును వేగంగా పోనిచ్చాడు. అయితే కిర్లంపూడి గ్రామంలో పైడితల్లి అమ్మ గుడి పక్కన ఉన్న రోడ్డుపై కారు నుంచి 2 గంజాయి ప్యాకెట్లు పడి ఉండడాన్ని పోలీసులు గమనించారు. అనంతరం ఈగల్ టీమ్ సహకారంతో ఐటీకోర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ నెల 25న ఆ కారును ట్రాక్ చేస్తూ వెళ్తుండగా పెద్దాపురం మండలం ఆర్‌బి కొత్తూరు నుంచి చినబ్రహ్మదేవం గ్రామం వెళ్లే రోడ్డులోని పోలిమేర పుంత దారి పొలాల్లో కిట్‌కిట్ ప్లాస్టిక్ కవర్‌లో ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించి 165 గంజాయి ప్యాకెట్లను పోలీసులు సీజ్ చేశారు. దీనిపై కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు.

అలాగే జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద జరిగిన ఘటనపై భీమునిపట్నం పోలీస్‌స్టేషన్‌లో గంజాయి రవాణా కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదైనట్టు ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారని, విశాఖ ఏజన్సీ ప్రాంతమైన జి.మాడుగులకు వ్యాపారం నిమిత్తం వలస వచ్చినట్టు ఎస్పీ తెలిపారు. వారు అక్కడే ఉంటూ విశాఖ ఏజన్సీ, ఒడిస్సా నుంచి గంజాయిని సేకరించి రాజస్థాన్‌కు తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో కాదంసింగ్ (22) అలియాస్ కుందన్‌సింగ్, కన్వర్ దేవి (55), మాహికన్వర్ (23) అలియాస్ లాక్‌సువాన్ సింగ్‌ను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వారి నుంచి రూ. 19,19,100 విలువైన 383.820 కిలోల బరువున్న 175 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇన్నోవా క్రిష్టా కారు, 2 సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్టు ఎస్పీ వెల్లడించారు. వీటి మొత్తం విలువ రూ.29,23,100 ఉంటుందని తెలిపారు. పరారైన మరో నలుగురి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ వెల్లడించారు. సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్‌బీ డీఎస్పీ కెవి సత్యనారాయణ, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి తల్లి.. గుండె తల్లడిల్లి...

జ్వరంతో ఏడాదిన్నర పాప మృతి

నేత్రాలను దానం చేసిన కుటుంబసభ్యులు



చిన్నారి కిరణ్మయి(ఫైల్)

ఆత్రేయపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో ఏడాదిన్నర చిన్నారి అకస్మికంగా మృతిచెందింది. కుటుంబసభ్యులు ఆ చిన్నారి నేత్రాలను దానం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన ముళ్ళపూడి వెంకటకృష్ణకిషోర్ వద్దిపర్రు సొసైటీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. వెంకటకృష్ణకిషోర్- నవ్య దంపతుల ద్వితీయ కుమార్తె ముళ్ళపూడి కిరణ్మయి (18 నెలలు) వైరల్ జ్వరంతో ఆదివారం రాత్రి వైద్యం పొందింది. సోమవారం ఉదయం అకస్మికంగా మృతిచెందింది. ఆ చిన్నారి నేత్రాలను అనపర్తికి చెందిన శ్రీరాధాకృష్ణ ఐ బ్యాంకు వైద్య బృందం వచ్చి కుటుంబసభ్యుల అనుమతితో సేకరించారు. చిన్నారి మృతి పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు తదితరపార్టీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

గోదావరిలో గల్లంతైన భవానీ భక్తుల మృతదేహాలు లభ్యం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్‌లో గోదావరిలో ప్రమాదవశాత్తూ గల్లంతైన ఇద్దరు భవానీ భక్తుల మృతదేహాలు 2 రోజుల తర్వాత సోమవారం లభ్యమయ్యాయి. గోకవరం మండలం పెంటపల్లికి గుబ్బల బాపిరాజు (28) రాజమహేంద్రవరం ప్రకాశంనగర్‌లోని ఒక అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన బావమరిది (భార్య అన్న) రాయుడు వీరబాబు(21) హైదరాబాద్‌లోని ఓ గోల్ట్ షా పులో పని చేస్తున్నాడు. దసరా కావడంతో బావ వద్దకు వచ్చాడు. బాపిరాజు, వీరబాబు, బాపిరాజు నాలుగేళ్ల పెద్ద కూతురు భవానీ భవానీమాల వేసుకున్నారు. 27న సాయంత్రం గోదావరి స్నానానికి పుష్కరఘాట్‌కు వెళ్లారు. బాపిరాజు, వీరబాబు వరద ఉధృతికి గల్లం తయ్యారు. 2రోజుల అనంతరం మృతదేహాలు కడియపులంక కాలువలో తేలాయి. వరద ఒడి ఎక్కువగా ఉండడంతో అంత దూరం కొట్టుకెళ్లాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు వాటిని ఒడ్డుకు చేర్చి మార్చురీకి తరలించారు. అనంతరం సంబంధీకులకు అప్పగించారు.

మళ్లీ గోదారి వరద

- భద్రాచలం వద్ద 45 అడుగులు దాటిన నీటిమట్టం
- ధవళేశ్వరం వద్ద రాత్రి 7 గంటల నుంచి పెరుగుదల
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం



వరద ఉధృతి కారణంగా రాజమహేంద్రవరంలో పుష్కర్‌ఘాట్ వద్ద హెచ్చరిక ఫ్లెక్సీ



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద మళ్లీ పెరిగింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఈనెల 27న జారీ చేసిన మొదటి ప్రమాద హెచ్చరికను సోమ వారం 6 గంటలకు ఉపసంహరించుకున్నారు. అయితే రాత్రి 7గంటల నుంచి మళ్లీ పెరుగుదల కనిపించింది. ఎగువన కురిసిన వర్షాల వల్ల భద్రాచలం నీటిమట్టం కూడా పెరుగుతోంది. ఇరిగేషన్ అధికార్ల కథనం ప్రకారం.. భద్రాచలం వద్ద నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరికను దాటి 45 అడుగులకు పైగా పెరుగుతోంది. ఇది 48 అడుగులకు చేరితే అక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 7గంటలకు నీటి మట్టం 11.70 అడుగులుగా ఉంది. ఇది 11.75కి చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ఈసారి ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం కూడా ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి 9,77,625 క్యూసెక్కుల నీటిని వదిలేస్తున్నారు. బ్యారేజీ గేట్లన్నీ ఎత్తివేసి ఉన్నాయి. ఇక ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని తూర్పు డెల్టా కాలువలకు 3900 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టా(కోనసీమ)కు 2100 క్యూసెక్కులు, పశ్చిమ డెలాకు 6500 క్యూసెక్కులు మొత్తం 12,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం దిగువ నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా ధవళేశ్వరం బ్యారేజీ వరకూ ఉన్న అఖండ గోదావరి ఉధృతి మరింత పెరిగింది. గోదావరి ఘాట్లలో వరద ఉధృతి ఉండడం వల్ల, ఇటీవల ఇద్దరు భక్తులు గల్లంతు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, గోదావరి స్నానాలకు ఎవరినీ వెళ్లనీయకుండా కట్టుదిట్ట ఏర్పాట్లు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లంకలలోకి నీరు బాగా పెరుగుతోంది. రాజమండ్రి లంకల్లోని మత్స్యకార కుటుంబాలను పునరావాసకేంద్రాలకు తరలించారు.

ముంపులో మిర్చిపంట

ఎటపాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఏజెన్సీ గ్రామాల్లో వారం క్రితమే రైతులు మిర్చిపంటను సాగు చేశారు. ప్రస్తుతం గోదావరి వరద ఉధృతి పెరుగుతూ ఉండడంతో మిర్చితోటలన్నీ వరదముంపులో చిక్కుకున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. 2రోజులుగా భద్రాచలం- కూనవరం రోడ్‌లో మురుమూరు వద్ద రహదారి ముంపులో చిక్కుకోవడంతో ఇటు వైపుగా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే నెల్లిపాక- వీరాయిగూడెం గ్రామాల మధ్యలో రహదారిపై వరదనీటితో రాకపోకలు ఆగిపోయాయి.



మురుమూరులో ముంపులో చిక్కుకున్న మిర్చితోట, రహదారిపై చేరిన వరదనీరు

దసరా సెలవులకు వచ్చి.. తిరిగిరాని లోకాలకు..

ఏటి కాలువలో యువకుడి మృతి



కుమారుడి మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి



అఖిల్(ఫైల్)

కొత్తపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు ఇంటికి వచ్చి ఆపై స్నేహితులతో కలిసి గోదావరి ఏటి కాలువలో స్నానానికి వెళ్లి యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి శివారు నక్కావారిపేటలో జరిగింది. ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... వానపల్లి శివారు నక్కావారిపేటకు చెందిన నక్కా రాంబాబుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నక్కా అఖిల్ (19) సోమవారం ఉదయం తమ్ముడు విజయ, స్నేహితులు యడ్ల రవితేజ, బుడితి సతీష్‌తో కలిసి అద్దంకివారిలంక సమీపంలో గల గోదావరి నదీపాయలో గల ఏటికాలువ వద్దకు స్నానానికి వెళ్లాడు. అఖిల్‌కు ఈత రాకపోవడంతో అవతలి గట్టుకు అరటిబొందలపై వెళ్తున్న తరుణంలో గల్లంతయ్యాడు. స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వారిని ముగ్గుర్ని రక్షించగా అఖిల్ కోసం గాలించి నదీలోంచి బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న అఖిల్‌ను వెంటనే కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్టు తెలిపారు. దీంతో తండ్రి నక్కా రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు. భీమవరంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అఖిల్ దసరా సెలువలకు ఇంటికి వచ్చిన ఇలా మృత్యువాత పడటం తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు జీర్ణించుకోలేకపోయారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బాధితులను పరామర్శించారు.

ప్రాణరక్షణ కల్పించండి

పాడా కార్యాలయంలో నరసింగపురం మహిళ ఫిర్యాదు



పిఠాపురం పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న పంతంగి సుశీల

పిఠాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తన భర్త ఆస్తిని కబ్జా చేయడమే గాక వేధిస్తున్న వారి నుంచి కాపాడి ప్రాణరక్షణ కల్పించాలని కాకినాడ జిల్లా పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన పంతంగి సుశీల కోరింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. సోమవారం ఆమె పిఠాపురం పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. నరసింగపురం గ్రామానికి చెందిన తనకు ద్వారపూడికి చెందిన సత్యనారాయణతో వివాహమైందని.. 2010లో నా భర్త చనిపోగా స్వార్జితంగా, వారసత్వంగా వచ్చిన ఆస్తి ద్వారపూడిలో దుకాణం, 1.025 ఎకరాల భూమి, రాజమహేంద్రవరంలోని ఇంటి వాటాను బంధువులే కబ్జా చేశారని తెలిపింది. ప్రశ్నిస్తే తనను, తన కుమారుడు పంతంగి కార్తీక్ సుందర్‌ను చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయింది. తమ ఆస్తులను ఇప్పించి ప్రాణరక్షణ కల్పించాలని కోరింది. ఆస్తులు ఉన్నా తినడానికి తిండికి కూడా ఇబ్బందిపడుతున్నామని చెప్పింది.

క్రీడా అకాడమీలకు పూర్వవైభవం

త్వరలో పునఃప్రారంభానికి చర్యలు

కాకినాడలో పర్యటించిన 'శాప్' కమిటీ సభ్యులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న 'శాప్' కమిటీ సభ్యులు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ క్రీడా అకాడమీలను త్వరలో పునఃప్రారంభించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చర్యలు చేపట్టిందని బోర్డు సభ్యుడు, అకాడమీస్ కమిటీ సభ్యుడు ఎ.రమణారావు పేర్కొన్నారు. ఎ.రమణారావు, పేరం రవీంద్రనాథ్, కె.జగదీశ్వరి, వీటీవీ ఎస్ఎన్ రాజులతో ఏర్పాటైన శాప్ అకాడమీస్ కమి టీ సోమవారం కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణాన్ని సందర్శించింది. క్రీడా అకాడమీల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న వసతులు, అదనంగా కావలసిన సౌకర్యాలను అధ్యయనం చేసింది. డీఎస్ఏ కార్యాలయంలో కమిటీ సభ్యులు మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తమ పర్యటన వివరాలను తెలియజేశారు. కమిటీ సభ్యుడు రమణారావు మాట్లాడుతూ కొవిడ్ సంక్షోభం, నిధుల కొరత కారణం గా రాష్ట్రంలో క్రీడా అకాడమీలు 2019లో మూతపడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి అనుసరిస్తున్న విధానాలకు అనుగుణంగా క్రీడా అకాడమీలను పునరుద్ధరించేందుకు శాప్ చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు, తిరుపతి డీఎస్ఏల్లో అకాడమీల పునఃప్రారంభానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను, ఇంకా కావలసిన సౌకర్యాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. ఏపీ క్రీడా అకాడమీలను ఎక్కడ ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై తమ కమిటీ శాప్‌కు నివేదిక సమర్పించనుందన్నారు. వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మెరుగైన క్రీడా శిక్షణ కల్పించేందుకు వంద మంది కోచ్‌ల నియామకానికి 'శాప్' రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం కోరిందన్నారు. క్రీడా అకాడమీలను పునఃప్రారంభించేందుకు శాప్ చర్యలు తీసుకుంటుందని... 14 నుంచి 16 రకాల క్రీడాంశాలు ఈ అకాడమీల పరిధిలో ఉంటాయన్నారు. సుమారు 150 మంది క్రీడాకారులకు శిక్షణ కల్పించేందుకు అనువుగా ఇండోర్, ఔట్‌డోర్ క్రీడా వేదికలు, హాస్టళ్లు, కిచన్లు, డైనింగ్‌హాళ్లు వంటి అవసరమైన అన్ని వసతులను ఈ అకాడమీల్లో కల్పిస్తామన్నారు. కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో దాదాపు అన్ని క్రీడ ల శిక్షణకు తగిన వసతులు ఉన్నాయని డార్మిటరీ నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం, కోచ్‌ల నియామకం వంటి అంశాలను తమ పరిశీలనలో గుర్తించామన్నారు. వీటిపై శాప్‌కు నివేదిక సమర్పిస్తుందన్నారు. డీఎస్ఏ సిబ్బంది వేతనాల కుదింపు, పెండింగు బకాయిల చెల్లింపు సమస్యలపై వినతిపత్రం కమిటీకి సమర్పించగా శాప్‌కు తెలియజేస్తామన్నారు. అలాగే పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేసి పేద క్రీడాకారులకు శిక్షణా వసతులను అందుబాటులోకి తెస్తామని కమిటీ సభ్యులు వివరించారు. జిల్లా క్రీడా మైదానంలోని వివిధ క్రీడా విభాగాల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎస్డీవో శ్రీనివాసరావు, డీఎస్ఏ కార్యాలయ సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు.

అన్నవరం దేవస్థానంలో నూతన శానిటరీ కాంట్రాక్ట్ నిబంధనలపై సమీక్ష

50 ఏళ్లలోపు వారికే అవకాశం

సూపర్‌వైజర్లకు డిగ్రీ అర్హత

అన్నవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఖరారు చేసిన సెంట్రలైజ్డ్ కాంట్రాక్ట్‌కు సంబంధించి సంస్థ ప్రతినిధులు, సిబ్బందితో సోమవారం అన్నవరం దేవస్థానం ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన నిబంధనల మేరకు 50 ఏళ్ల వయసుకు లోబడి ఉన్నవారిని కార్మికులుగా తీసుకోవాలని, సూపర్‌వైజర్లకు డిగ్రీ అర్హతగా నిర్ణయించారు. ప్రస్తుత కాంట్రాక్ట్‌లో 349 మంది పనిచేస్తుండగా, వచ్చే నెల 1నుంచి నూతన టెండర్ ద్వారా 413మందిని తీసుకుంటున్నట్టు తెలిపారు. నూతన సాంకేతికతతో కూడిన మిషనరీని కాంట్రాక్ట్ నిర్వహణ సంస్థ సమకూర్చుతుండగా ఎక్కడా ఏవిధమైన అలసత్వం లేకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఈవో కాంట్రాక్ట్ సంస్థను కోరారు. నూతన నిబంధనల ప్రకారం 50 ఏళ్లలోపు వ్యక్తులకు మాత్ర మే పనికల్పించాలనే విషయంలో ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో కొందరు 50 ఏళ్లకు పైగా ఉన్న వ్యక్తులు ఉండడంతో వారంతా తుని, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలను కలిసి తమ గోడును విన్నవించుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి



మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు

సామర్లకోట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధిలో కొత్తూరు ప్రెసిడెంట్‌గారి వీధిలో మట్టపల్లి సత్రం ఎదురుగా సోమవారం ఒక భవనానికి పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్న అరవ అరుణ్‌కుమార్(37) ప్రమాదవశాత్తూ కిందికి పడడంతో తీవ్రగాయాలతో మృతిచెందాడు. సామర్లకోట పెన్షన్ లైన్‌కు చెందిన అరుణ్‌కుమార్ సహచర కూలీలతో పెయింటింగ్ పనుల్లో పాల్గొన్నాడు. ప్రమాదవశాత్తూ తాడు కిందికి జారడంతో కిందికి పడిపోయాడు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం కలరు. పేదకుటుంబం కావడంతో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోధించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని పెన్షన్‌లైన్‌కు చెందిన పలువురు ఆసుపత్రి వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

ప్రాణం నిలబెట్టేందుకు పాట్లు!

పాము కాటుకు గురైన మహిళ

అడ్డంకుల మధ్య ఆసుపత్రికి తరలింపు



రత్తమ్మను నాటు పడవపై ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

చింతూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన మహిళ ప్రాణాలు కాపాడడానికి ఆ కుటుంబం నానా పాట్లు పడాల్సి వచ్చింది. వరదతో రహదారి మూసుకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ముందు ఓ ద్విచక్ర వాహనంపై తర్వాత నాటు పడవపై చివరకు ఆటోపై ఆసుపత్రికి చేర్చాల్సి వచ్చింది. అల్లూరి జిల్లా చింతూరు మండలం పెద్దసీతనపల్లికి చెందిన శ్యామల రత్తమ్మ తన ఇంటి సమీపంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద వాచ్‌మెన్‌గా వ్యవహరిస్తోంది. ఎప్పటి మాదిరిగానే సోమవారం రత్తమ్మ టవర్ వద్ద శుభ్రం చేసేందుకు వెళ్లి పాము కాటుకు గురైంది. కుటుంబీకులకు విషయం తెలిపింది. పెద్ద సీతనపల్లి నుంచి చింతూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లాలంటే 12 కిమీ ప్రయాణం చేయాల్సి ఉంది. కాగా నడుమ సోకిలేరు వాగు పొంగి ఉండడంతో ఆ వైపు వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ద్విచక్ర వాహనంపై ఇద్దరు కలిసి ముందుగా రత్తమ్మను సోకిలేరు వాగు వద్దకు తరలించారు. వెనువెంటనే నాటు పడవపై సోకిలేరు వాగు దాటించారు. ఇక చీకటి వాగు కారణంగా రహదారి నీట మునిగి ఉండడంతో ఆటోపై వయా వేగితోట మీదుగా చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి రత్తమ్మకు చికిత్స అందించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు.

వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి

ఇద్దరు ఆటో యూనియన్ ప్రతినిధుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పిఠాపురం సీఐ

పిఠాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేసి నడి రోడ్డుపై కొట్టిన ఆటో యూనియన్ ప్రతినిధులను పిఠాపురం పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ వెల్లడించారు. పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం వద్ద గల ఆటో స్టాండులోని యూనియన్ సభ్యత్వాల విషయంలో వచ్చిన వివాదాల నేపథ్యంలో దవులూరి గంగరాజు అనే వ్యక్తిని యూనియన్ ప్రతినిధులుగా ఉన్న అన్నదమ్ములు దవులూరి లచ్చబాబు, రాంబాబు, వారి కుమారుడు కలిసి రోడ్డుపై కింద పడవేసి విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు. ఈ నెల 22న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీలు ఆదివారం రాత్రి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పోలీసులు గంగరాజుపై దాడికి పాల్పడ్డ లచ్చబాబు, రాంబాబును అరెస్టు చేశారు. వారిద్దరిపై పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయని పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు.

రాయవరంలో రాళ్ల దాడి ఘటనపై కేసు

రాయవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ముత్యాలమ్మ గుడి షెడ్ నిర్మిస్తున్న వ్యక్తులపై రాళ్లదాడి చేసిన వ్యక్తులపై హత్య, హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు సోమవారం తెలిపారు. షెడ్ నిర్మాణం వద్ద రాళ్ల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ బొదంకి సత్యనారాయణ(సత్తిబాబు) రాయచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతిచెందగా పలువురు మహిళలు గాయపడిన విషయం విదితమే. కమిటీ సభ్యులపై రాళ్లు రువ్విన వ్యక్తులపై మృతుడి భార్య వెంకటలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుపై రేలంగి నాగేశ్వరరావు, రమణ అనే మహిళపై పలు సెక్షన్లకింత హత్య, హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. మండపేట రూరల్ సీఐ పీతల దొరరాజు దర్యాప్తు చేస్తున్నారు. ముత్యాలమ్మ గుడి వద్ద దాడికి వినియోగించిన రాళ్లను సీఐ దొరరాజు ఆధ్వర్యంలో పర్యవేక్షించి క్లూస్‌టీం బృందం పరిశీలించి వివరాలు సేకరించారు.

ముగిసిన బతుకమ్మ సంబరాలు

వీఆర్‌పురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరాను పురస్కరించుకుని నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. అల్లూరి జిల్లా వీఆర్‌పురంలో వివిధ కూడళ్లలో సంస్కృతి, సాంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ ఆటపాటలు నిర్వహించారు. 5 అడుగుల ఎత్తుగల బతుకమ్మను బంతిపూలతో తయారు చేసి పూజలు నిర్వహించారు. గోదావరినదిలో నిమజ్జనం చేశారు. జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, టీడీపీ నాయకులు బొర్ర నరసింహరావు, బురక కన్నారావు తదితరులున్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన సేవలకు కృషి

జీజీహెచ్ తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



జీజీహెచ్‌లో ల్యాబ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌తో సహా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రక్త శాంపిల్స్ తీసే విభాగం, వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండేదని, కూటమి అధికారంలోకి వచ్చాక నియామకాలు చేపట్టామని, అయినా 40శాతం లోటు ఉందని అన్నారు. కొన్ని స్పెషలిస్టు పోస్టులను భర్తీ చేసినా ఎవరూ ఇక్కడ జాయిన్ కావడంలేదన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు చెప్పడం వల్ల వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. ఇంత పెద్ద వ్యవస్థలో చిన్నచిన్న లోపాలు సహజమని అన్నారు. వాతావరణ మార్పుల వల్ల వ్యాధులు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట జీజీహెచ్ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గన్ని కృష్ణ ఆధ్వర్యంలో వైభవంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న గన్నికృష్ణ, ఆయన కుమార్తె స్మిత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ్‌నగర్‌లో శ్రీసంకట హరవర సిద్ధి వినాయక ఆలయం వద్ద సోమవారం సప్తశతి పారాయణ సహిత విశిష్ట చండీహోమం వైభవంగా నిర్వహించారు. కోట గణేష్‌శర్మ సారధ్యంలో గన్ని కృష్ణ, ఆయన కుమార్తె స్మిత హోమం, పూజలు చేశారు.అనంతరం చేపట్టిన అన్నసమారాధనను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, జీఎస్ఎల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రముఖులు అన్నెం శ్రీరంగనాయకుల ప్రభు, గన్ని అల్లుడు అన్నె రామకృష్ణ, శెట్టి బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మాజీ ఎంపి మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా,రౌతు సూర్యప్రకాశరావు, పంతం రజనీశేషసాయి, మేడపాటి షర్మిళారెడ్డి, టీడీపీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, బొదులూరి వెంకటేశ్వరావు, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 9 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి 9 అర్జీలు వచ్చాయని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 1, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 4, పబ్లిక్ హెల్త్‌కు 2, వార్డు సచివాలయాలకు 2 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీలను పరిష్కరించడంలో అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రజా సమస్యల ఆడిట్ నిర్వహణ సరిగ్గా జరగాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య,ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, మేనేజరు ఎండీ అబ్దుల్‌మాలిక్, ఆర్వో సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ బ్రోచర్‌ను రామలింగేశ్వర్ ఆవిష్కరించారు. జీఎస్టీ సంస్కరణల మూలంగా క్షేత్రస్థాయిలో చేకూరే మేలును ప్రజలకు వివరించాలని సూచించారు.

ఎమ్మెల్యే కుటుంబ సభ్యులపై అనుచిత పోస్టింగ్‌లు

విలేకరి అరెస్టు

అనపర్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత ఫేస్‌బుక్‌లో అనుచిత పోస్టింగులు పెట్టిన విలేకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు. అనపర్తికి చెందిన పిల్లారిశెట్టి సాయిప్రకాష్ అనే విలేకరి(పీడీఎఫ్ పేపర్) 2023లో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై తప్పుడు కథనం రాయడమే కాకుండా బలభద్రపురం గ్రామానికి చెందిన కర్రి రామకృష్ణారెడ్డి, సబ్బెళ్ల కృష్ణారెడ్డిల ప్రోద్బలంతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారన్నారు. ఇదే విషయాన్ని రామవరానికి చెందిన టీడీపీ కార్యకర్త సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి గత ఏడాది నవంబరు 27న సాయిప్రకాష్‌ను ప్రశ్నించగా ఆయనను తీవ్ర పదజాలంతో దూషించి బెదిరించాడు. దీనిపై సత్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయిప్రకాష్‌పై కేసు నమోదు చేశామని ఈ నెల 28న అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

పునరావాస కేంద్రానికి 274 మంది మత్స్యకారులు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండడంతో లంకల్లో ఉన్న 274 మంది మత్స్యకారులను అధికార యంత్రాంగం పునరావాస కేంద్రానికి తరలించింది. సోమవారం రాజమహేంద్రవరంలోని బ్రిడ్జిలంక, కేతావారీ లంక, వెదురమ్మలంకల్లో నివాసం ఉన్న 98 కుటుంబాలకు చెందిన 274 మందిని బోట్లలో రాజమహేంద్రవరం తరలించి మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాని చేర్చారు. ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. భోజన వసతి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బ్రిడ్జిలంక నుంచి 123 మంది, కేతా వారి లంక నుంచి 75 మంది, వెదురమ్మ లంక నుంచి 76 మందిని తరలించామన్నారు.

ఎమ్మెల్యే బత్తుల.. అర్జీల స్వీకరణ

కోరుకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరుకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని త్వరగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సత్యసాయి డ్రింకింగ్ వాటర్ పథకానికి రూ.1 కోటి నిధులు మంజూరు చేయించినందుకు పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం వాహనమిత్ర పథకం ద్వారా అక్టోబర్ 4న ఆటో,డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు వేయనున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు.ఈ సందర్భంగా కోరుకొండ ఆటో యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే బత్తులను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

దోసకాయలపల్లిలో ఉద్యాన శాఖాధికారి పర్యటన

కోరుకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఉద్యాన శాఖ అధికాధికారి రీని క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. దానిలో భాగంగా ఆఫ్రికా నత్తలు ఆశించిన పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు రైతులకు తెలియజేశారు. ఈ నత్తలు మామూలుగా తోటలో కనిపించేవి కాదని, ఆఫ్రికాదేశం నుంచి వలస వచ్చిన జాతి అన్నారు. ఒక్కొక నత్త 1000 నుంచి 1200 గుడ్లు పెడుతుందని, సరైన నివారణ చర్యలు రైతులు సామూహికంగా చేపట్టాలని ఆమె సూచించారు. తోటలో కనిపించిన నత్తలను ఏరి 1కిలో ఉప్పును లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో వేసి నివారించవచ్చని చెప్పారు. నత్తల ఉధృతి ఎక్కువైతే 1లీ నీటికి 3గ్రాముల చిలెటెడ్ కాపర్, 3 గ్రాముల చిలెటెడ్ ఐరన్ కలిపి చెట్ల మీద పిచికారీ చేయాలన్నారు. ఒక తోట నుంచి మరో తోటకి వ్యాప్తి చెందకుండా సరిహద్దులో అక్కడక్కడ ఉప్పునీరు చల్లిన గోనె పట్టలను పరచాలని రీని సూచించారు.

సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన
కనకదుర్గమ్మ

- అమ్మవారి ఆలయాల్లో విద్యార్థుల పూజలు
- పుస్తకాలు, పెన్నుల పంపిణీ
- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కడియం: కడియపులంక అనంతేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గోకవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు సందర్భంగా గోకవరంలోని ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లోని వీరభద్రుడి గద్దెలో కనకదుర్గమ్మ తల్లి సోమవారం సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రముఖ వ్యాపారి కంచర్ల ప్రకాష్, నాగేశ్వరరావు కుటుంబసభ్యులు పుష్పాలంకరణ చేశారు. సుమారు 300 మంది చిన్నారులతో ఆలయార్చకులు సరస్వతి పూజ చేయించారు. అనంతరం అమ్మవారి ప్రతిమ, పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు, రబ్బరులు, మ్యాజిక్ స్లేటులు అందజేశారు. మూల నక్షత్రం కావడంతో అమ్మవారికి తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

కడియం: కడియపులంక అనంతేశ్వరస్వామి ఆలయంలో అపర్ణాదేవి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మార్గాని సత్యనారాయణ, సభ్యులు పర్యవేక్షణలో ప్రధానార్చకులు దేవరభట్ల శ్రీనివాసశర్మ కుంకుమపూజలు నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు, పంచామృతాలతో కూడిన శీతలపానీయాలు అందజేశారు.

దివాన్‌చెరువు: లాలాచెరువు హౌసింగ్‌బోర్డుకాలనీలో బాలా త్రిపురసుందరీదేవి ఆలయంలోను, దివాన్‌చెరువులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ సముదాయంలో కొలువైన కాశీఅన్నపూర్ణేశ్వరి ఆలయంలోనూ, రాంబాబు డాక్టరు గృహ ఆవరణలోని శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షత్ర వేడుకలను నిర్వహించారు. హౌసింగ్ బోర్డులోని బాలా త్రిపురసుందరిదేవిని, స్థానిక కాశీఅన్నపూర్ణదేవిని సరస్వతిదేవిగా అలంకరించారు. ఆలయ వేదపండితుల అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. విశ్వేశ్వరీదేవి ఆలయంలో విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు. పాలచర్లలోని శ్రీసాయిదుర్గ అభయాంజనేయస్వామి వార్ల ఆలయం వద్ద దుర్గమ్మతల్లి మండపం, శ్రీరాంపురం, తుంగపాడు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో జగన్మాతకు విశేషపూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గాదాలలో కుంకుమపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల

బిక్కవోలు: బిక్కవోలు జువ్వలదొడ్డిలోని శ్రీరా జరాజేశ్వరి పీఠం, కరణంగారి మేడలో, శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో, ప్రాచీన గోలిగేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. అలాగే కొంకుదురు గోపాలనాయుడు వీధిలో, ఆరికరేవుల గ్రామంలో చిన్నారులతో అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

రాజమహేంద్రవరం కల్చరల్: నగరంలోని జాంపేటలో శ్రీ కనకదుర్గాదేవిని భక్తులు సరస్వతి దేవిగా కొలిచారు. విద్యార్థులు 600 మందికి పైగా సరస్వతి పూజలో పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న వారందిరికీ ఉత్సవకమిటీ కుంకుమ, పూజా సామగ్రి అందజేశారు.కార్యక్రమంలో అధ్యక్షుడు గంపా గిరిజాశంకర్, ఆకాశపు సాంబ, బొమ్మన శ్రీను, కేవీ అప్పారావు పాల్గొన్నారు. సీతంపేట మాతృరూపిణి మందిరంలో మాతృ స్వరూపిణి సేవా సంస్థ ఆధ్వర్యంలో సరస్వతి పూజలు జరిగాయి. సంస్థ వ్యవస్థాపకుడు అజ్జరపు హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీకాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం దంపతులు అతిథులుగా విచ్చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక తిలక్ రోడ్ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు విద్యార్థులతో సరస్వతీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ దంపతులు సాయిబాబాకు పూజలు చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

కోరుకొండ: మండలం గాడాల గ్రామంలో దుర్గాదేవి ఆలయంలో నిర్వహించిన కుంకుమ పూజలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని శ్రీ రాజరాజేశ్వరి, దుర్గాదేవి అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని వెంకటాపురంలో దేవి లలితాంబ ఆలయం వద్ద సరస్వతి పూజ నిర్వహించారు. కమిటీ సభ్యులు విద్యార్థులకు పెన్నులను అందించారు. వడిశలేరు ఏడీబీ రోడ్డులోని సాయిదుర్గా కాలనీ వద్ద విజయదుర్గమ్మకు నడివీధిలో భవానీలు, గ్రామ ఆడపచుడులు చీరలు, పండ్లు, స్వీట్స్‌లతో సారె సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని మాజీ జడ్పీటీసీ కర్రి శేషారత్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రిశక్తి పీఠంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఓం శక్తి సత్సంఘ పీఠం, తురకవీధి పీఠం, మహాలక్ష్మి ఆలయం, త్రిశక్తి పీఠంలలో అమ్మవారు సరస్వతీ అలకంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





జీఎస్టీపై పలుచోట్ల అవగాహన

బిక్కవోలు/రాజానగరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై సోమవారం బిక్కవోలు, రాజానగరంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బిక్కవోలులో ఎంపీడీవో వి.శ్రీనివాస్, రాజానగరంలో లీగల్ మెట్రాలజీశాఖ రాజమహేంద్రవరం అసిస్టెంట్ కంట్రోలర్ బీఎస్‌వీ సాయి ఈశ్వర్‌రామ్ ఇంటింటికీ వెళ్లి తగ్గిన జీఎస్టీ వస్తువులను గుర్తి వివరించారు. జీఎస్టీ తగ్గించకుండా వస్తువులు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే వివిధ షాపులను సందర్శించి జీఎస్టీ అమలు చేస్తున్నారో లేదో పరిశీలించారు.కార్యక్రమంలో బిక్కవోలులో డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఏవో నాగేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి డీఆర్ఎన్ పద్మజ, ఏపీఎం సుప్రియ, సచివాలయ సిబ్బంది, రాజానగరంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగేంద్రకుమార్, కార్యదర్శి కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైనేజీ ఆక్రమణల తొలగింపు

రంగంపేట,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రంగంపేటలో పలువురు డ్రైన్లను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో ఇళ్లలో వాడకం నీరు, వర్షపు నీరు ప్రవహించక గ్రామస్థులు అనేక ఇబ్బంది పడుతున్నట్టు పంచాతీయి కార్యదర్శి వి.శ్రీరామమూర్తి దృష్టికి వచ్చింది. దాంతో సోమవారం డ్రైన్ల ఆక్రమణలను తొలగింపు ప్రారంభించారు. ముందుగా రాజుగారి మిల్లు వీధి నుంచి ప్రారంభించి పంచాయతీ సిబ్బందితో ఆయన గ్రామంలోని ఆక్రమణలను తొలగించారు.

డీవీఎంసీలో సభ్యుల నియామకానికి
దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల ప్రజలపై జరుగుతున్న అత్యాచార కేసుల పరిశీలన, నివారణ చర్యలకు సంబంధించి తూర్పుగోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ(డీవీఎంసీ)లో ఇతర కులాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు ఎన్‌జీవో సభ్యులను జిల్లా కమిటీకి ఎంపిక చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎండీ గయాజుద్దీన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎస్సీ, ఎస్టీలు సంబంధించిన వారు కాని ఎన్‌జీవోల్లో ఆసక్తి ఉన్న వారు అక్టోబరు 7వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.

రాష్ట్ర విద్య మౌలిక వసతుల సంస్థ
డైరెక్టర్‌గా వేణమ్మ బాధ్యతల స్వీకరణ

బిక్కవోలు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య మౌలిక వసతుల సంస్థ డైరెక్టర్‌గా విజయవాడలో సోమవారం బేరా వేణమ్మ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ జుత్తుక సూర్యకుమారి, సొసైటి ఛైర్మన్ పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, కూటమి నాయకులు వైదాడి వెంకటేశ్వరరావు, బేరా శ్రీను, గోవిందు, రాయుడు రామచంద్రరావు, పల్లి రాజారెడ్డి అభినందించారు.

'అర్ధరాత్రుళ్లు తలుపు తడితే తీయొద్దు'

కోరుకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాత్రుళ్లు ప్రజలు ఒంటరిగా తిరగవద్దని, ముఖ్యంగా అర్ధరాత్రుళ్లు ఎవరైనా తలుపు తడితే తీయవద్దని ఎస్ఐ కేవీ నాగార్జున ఓ ప్రకటనలో తెలిపారు. దోపిడీలకు దాడులకు పాల్పడే మధ్యప్రదేశ్‌కి చెందిన ధార్ గ్యాంగ్ జిల్లాలో తిరుగుతుందని, అర్ధరాత్రుళ్లు ఇళ్లలోకి చొరబడి బంగారం, డబ్బు, విలువైన వస్తువులు దోచుకెళ్లిపోతున్నారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112కు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్ఐ సూచించారు.

డీఎల్ఎస్ఏ మోనిటరింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి సోమవారం మోనిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించడానికి నియమితులైన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిపై చర్చించారు. ఆ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, ఏదైనా సమస్యలు ఉంటే డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల వివరాలపై ఆరా తీశారు.

వంట నూనెల్లో ఆయిల్ పామ్ సింహభాగం

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో వంటనూనెల అవసరాలు తీర్చడంలో ఆయిల్‌పామ్‌ది సింహభాగమని తెలంగాణ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ సంస్థ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. స్థానిక జాతీయ వ్యవసాయ పరిశోదన సంస్థను సందర్శించిన ఆయన అశ్వగంధ పంటను ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సాగుచేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

ఆటోనగర్ అభివృద్ధికి సహకరిస్తా

ఆటో యూనియన్ నేతలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. సోమవారం శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు నేతృత్వంలో తొమ్మిది ఆటోయూనియన్ల నాయకులు స్థానిక తిలక్‌రోడ్డుని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదిరెడ్డి వాసును మర్యాద పూర్వకంగా కలిశారు. తామంతా ప్రతిరోజు రాజమహేంద్రవరం నుంచి ఆటోనగర్‌కు వెళ్తున్నామని అక్కడ మౌలిక సదుపాయాలు కల్పనకు సహకరించాలని ఆటో యూనియన్ నాయకుల పక్షాన కుడుపూడి సత్తిబాబు కోరడంతో ఆదిరెడ్డి వాసు స్పందించి హామి ఇచ్చారు. కార్యక్రమంలో ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, కార్యదర్శి షేక్ హసీనా, ఉపాధ్యక్షులు తాడి వీరఅప్పారావు, సంయుక్త కార్యదర్శి పిల్లి గణేష్, ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షులు సన్యాసిరావు, టైర్ల యూనియన్ అధ్యక్షులు సత్తిబాబు, మెకానిక్ యూనియన్ అధ్యక్షులు పిల్లి గణేష్, లారీ బాడీబిల్డింగ్ యూనియన్ అధ్యక్షులు గోవర్ధన్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

కడియం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని సర్పంచ్ మారిశెట్టి పద్మావతి తెలిపారు. బుర్రిలంక సచివాలయం -3లోని రైతు సేవా కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గట్టి నర్సయ్య, మార్గాని ఏడుకొండలు, గట్టి దుర్గారావు, బొర్సు సుబ్రహ్మణ్యం, తీగిరెడ్డి నాగార్జున, పినిపే వెంకటేశ్వరరావు, పాటంశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవోలు వి.తులసిదాస్, పిల్లి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో రంగంపేట సచివాలయం-2, జి.దొంతమూరు సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాల్లో రంగంపేటలో 163 మందికి, జి.దొంతమూరులో 206 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ ఎలుగుబంటి సత్తిబాబు, జనసేన నాయకుడు గిరజాల సత్తిబాబు, దుప్పలపూడి రాజేష్, జటప్రోలు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి దుర్గారావు, పోతుల చిన్ని, ఉండవిల్లి మాణిక్యం, దూబాసి వరప్రసాద్, గుండుబిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.





మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం అమ్మవార్లకు సరస్వతిదేవి అలంకారం చేశారు..చిన్నారులు పెద్ద ఎత్తున పూజలు చేశారు.. జ్ఞానం ప్రసాదించమని వేడుకున్నారు.. బిక్కవోలులో అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేశారు. రాజమహేంద్రవరం దేవిచౌక్ సోమవారం రాత్రి భక్తులతో నిండిపోయింది. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. - బిక్కవోలు



గుండె.. పదిలమా! మనిషికి గ్యారంటీ లేకుండాపోయింది.. చిన్న వయసులోనే ఎంతో మంది గుండెపోటుకు గురవుతున్నారు.. అవగాహన లేక మరణానికి చేరువ అవుతున్నారు.. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం దేవరపల్లిలో పెద్ద ఎత్తున ఇలా అవగాహన ర్యాలీ నిర్వహించారు. - దేవరపల్లి



రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో భక్తులు

ఆటోమేటిక్‌గా!



4న డ్రైవర్ల ఖాతాల్లో సొమ్ములు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు పోటెత్తాయి. ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సాయం కోరుతూ ఆటోడ్రైవర్లు, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు పెద్ద ఎత్తున దరఖాస్తు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తాము వాహన యజమానులం అంటూ 36,360 మంది ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేయగా 35,543 మంది అర్హులుగా గుర్తించారు.అయితే పథకం కింద అర్హత సాధించని వారు తిరిగి దరఖాస్తు చేస్తే విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వచ్చే నెల 4న వీరందరికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో రూ.53.31 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించనుంది.ఇప్పటికే ఆటోలపై ప్రభుత్వం హరిత పన్ను తగ్గించడంతో ఉపశమనం కలగ్గా..ఆర్థిక సాయం అందిస్తుండడంపై ఆటోవాలాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులు 35,543 మంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36,360 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా కాకినాడ జిల్లాలో 14,722 మంది దరఖాస్తు చేసుకోగా 14,412 మందిని అర్హులుగా నిర్ధా రించింది. 248 మంది దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా లేక తిరస్కరించింది. మరో 62 దరఖాస్తులను హోల్డ్ చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 13,147 మంది దరఖాస్తు చేసుకోగా 12,894 మందిని అర్హులుగా తేల్చింది. 172 దరఖాస్తులు తిరస్కరించింది. మరో 81 దరఖాస్తులను హోల్డ్‌లో ఉంచింది.కోనసీమ జిల్లాలో స్వల్పంగా 8,491 దరఖాస్తులే దాఖల య్యాయి. 8,237 దరఖాస్తులకు అధికారులు ఆమోదముద్ర వేశారు. 179 దరఖాస్తులను తిరస్కరించగా 75 హోల్డ్‌లో ఉంచారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 35,543 మంది దరఖాస్తులకు ఆమోదముద్ర లభించింది.కేవలం 218 దరఖాస్తులను మాత్రమే ఆన్‌హోల్డ్‌లో ఉంచగా 599 మందిని తిరస్కరించారు.అర్హులైన లబ్ధిదారులకు అక్టోబరు 4న ప్రభుత్వం నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది.రూ.53.31 కోట్లు ఖర్చు కానుంది.

ఆటోవాలాలకు సాయం

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించింది. దీంతో తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని కార్మికులు ప్రభుత్వా నికి విన్నవించారు.పలుచోట్ల ఆందోళనలు చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రభుత్వం వరం ప్రకటించింది. అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు సీఎం చంద్రబాబు ఇటీవల అనంతపురం బహిరంగ సభలో ప్రకటించారు. దీంతో ఆటో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. పథకం పరిధిలోకి తమను కూడా తీసుకురావాలని క్యాబ్,మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.పథకానికి ఆటో డ్రైవర్ల సేవలో అని నామకరణం చేయడంతో రూ.15 వేలు అందాలంటే ఆటో,క్యాబ్ యజమాని స్వయంగా డ్రైవర్ అయి ఉండాలని పేర్కొంది.గూడ్స్ వాహనాలకు పథకం వర్తించదని స్పష్టం చేసింది.

వచ్చారు..పన్ను తగ్గించారు..

గత వైసీపీ సర్కారు హరిత పన్ను పేరుతో ఆటోవాలాలను నిలువునా దోచేసింది.జగన్ సర్కారు రాకముందు బైక్ నుంచి లారీ, టిప్పర్, ఆటో, స్కూల్ బస్సుల వరకు వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి రూ.200 వరకు మాత్రమే పన్ను కట్టించుకునేవారు. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక అన్ని రకాల వాహనాలపై హరిత పన్ను భారీగా పెంచేసి 2022 జనవరి 1 నుంచి అమలు చేసింది. అప్పటి వరకు ఉన్న రూ.200 పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసింది. వాహనం కొనుగోలు చేసిన తేదీ నుంచి త్రైమాసికాల పన్ను విడతల వారీగా పెంచేసింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆటోవాలాలు నష్టపోయారు.పెరిగిన పన్ను భారం భరించలేక ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరితపన్ను దోపిడీపై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు పన్ను తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్నారు.

నాడు ఇలా...

గత వైసీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను నిలు వునా మోసం చేసింది. వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయాన్ని అందించినట్టు అప్పట్లో గొప్పలు చెప్పింది.తీరా లబ్ధిదా రులను నిలువునా కోసేసి కేవలం కొందరికే పథ కం అమలు చేసింది.ఇలా ఆటో కార్మికులకు రూ.10 వేలు అందించి వారం వ్యవధిలోనే ఆర్టీవోలను రంగంలోకి దించి రకరకాల ఫైన్‌లు విధించింది. ఒక రకంగా చెప్పా లంటే ఆ చేత్తో రూ.10వేలు ఇచ్చి ఈ చేత్తో అందులో సగం వరకు లాగేసుకుంది.దీంతో ఆటోవాలాలు ఇబ్బం దులు పడ్డారు. అప్పట్లో వాహనమిత్ర పథకాన్ని కొంత కాలమే అమలుచేసి ఆ తర్వాత గాలికి వదిలేశారు.

నేడు ఇలా...

ప్రస్తుతం సీఎం చంద్రబాబు పథకం కింద అందించే సాయాన్ని రూ.15 వేలకు పెంచారు. ఎలాంటి కోతలు లేకుండా అర్హులను లబ్ధిదా రుల జాబితాలో చేర్చాలని ఆదేశించారు. పథకం నిబంధ నలను సైతం సడలించారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు పథకానికి దరఖాస్తులు చేసుకోగా, 90 శాతానికి పైగా దరఖాస్తులను ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు వేయకుండా ఆమోదించింది.

- ఒక్కొక్కరికి రూ.15 వేలు
- 36,360 దరఖాస్తులు
- కాకినాడలో 14,722
- తూర్పుగోదావరిలో 13,147
- కోనసీమలో 8,491
- 35,543 దరఖాస్తులకు ఆమోదం
- 172 దరఖాస్తులే తిరస్కరణ
- 218 మాత్రమే ఆన్‌హోల్డ్
- ఐదు రోజుల్లో నగదు జమ
- మొత్తం రూ.53.31 కోట్లు
- ఆటోలకు తగ్గిన హరిత పన్ను
- నాడు ఆటోడ్రైవర్లకు మోసం



పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అర్జీలపై తప్పుడు నివేదికలు వద్దు

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్జీలు స్వీకరించడం వాటిని పరిష్కరించడంతో సరికాదని.. వారు సంతృప్తి చెందడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో స్వయంగా 160 అర్జీలను స్వీకరించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.కొంత మంది అధికారులు అర్జీదారులను సంప్రదించకుండానే అర్జీలను పరిష్కరించి నివేదికలివ్వడం తప్పు అని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల, సచివాలయాల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు జిల్లా స్థాయికి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు వంటి సాధారణ సమస్యలకు స్థానికంగానే పరిష్కారం చూపాలన్నారు. నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీల్లో కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో జ్వరాలు అధికంగా నమోదవుతున్న ప్రాంతాల్లో బోరు నీటిని పరీక్షించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జేసీ వై.మేఘస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి, డీఎస్పీ భవ్యకిషోర్,స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, ఎస్.భాగ్యలక్ష్మి, వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ సుధాకర్, డీఎల్‌డీవో శ్లీవారెడ్డి, పి.వీణాదేవి పాల్గొన్నారు.


న్యాయం చేయండమ్మా..

కడియం మండలం వేమగిరి తోటకు చెందిన కుడుపూడి అశ్విని తనకు న్యాయం చేయాలని వేడుకుంది. తన భర్త కుడుపూడి శ్రీనివాస్ నాలుగు నెలల కిందట డ్రైవింగ్‌కి కారులో ఒడిస్సా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించారని.. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపింది.నా భర్త మరణించాక గడపదాటడానికి పుట్టినిట్టింకి వెళ్లి తిరిగొచ్చేసరికి మా అత్తమామలు, మరిది, ఆడబడుచు తాము అద్దెకు ఉన్న ఇంట్లోని సామగ్రి వారింటికి తీసుకునిపోయారని వాపోయింది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కొన్ని సామాన్లు ఇచ్చారని..కానీ తన భర్తకు సంబంధించిన ఇన్సూరెన్స్ తనకు చెందకుండా ప్రయత్నిస్తున్నారని ఎఫ్‌ఎంసీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తన ను బయటకి గెంటేసి దారుణంగా అవమానించారని తెలిపింది. దయచేసి తనకు న్యా యం చేయాలని కోరింది.దీనిపై స్పందించిన కలెక్టర్ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 22 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్(మీకోసం) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా మాట్లాడి 22 అర్జీలను స్వీకరించారు. చట్ట పరిధిలో తదుపరి చర్యలు త్వరితగతిన తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

గంటలోనే వరదెత్తింది



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి వరద

రాజమహేంద్రవరం/కొవ్వూరు,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంటల వ్యవధిలోనే గోదావరి ఉధృతంగా మారింది.ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు జారీ చేసిన మొదటి ప్రమాద హెచ్చరికను సోమవారం సాయంత్రం 6 గంటలకు ఉపసంహరించుకు న్నారు. కేవలం ఒక్క గంటలోనే రాత్రి 7 గంటల నుంచి మళ్లీ పెరుగుదల కనిపించింది. ఎగువన కురిసిన వర్షాల కారణంగా భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతోంది.ఆ ప్రభావం అఖండ గోదావరిపై పడుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు అధికంగా వచ్చి చేరడంతో గోదావరికి వరద పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తుంది.ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 7 గంటలకు నీటిమట్టం 11.70 అడుగులుగా ఉంది. ఇది 11.75కి చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ఈసారి ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు అధికారుల అంచనా. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ప్రధాన స్నానఘట్టాలు సోమవారం తెరుచుకునే లోపునే మళ్లీ వరదొచ్చిపడింది. నదీ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో నదిలో ఎవరూ దిగకుండా పోలీస్,ఇరిగేషన్ అధికారులు స్నానఘట్టాల వద్ద వెదురుకర్రలతో బారికేడ్లు ఏర్పాటుచేసి అడ్డంగా క్లాత్‌ను కట్టారు. దసరా పండుగను పురస్కరించుకుని కొవ్వూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా భవానీ మాలలు, అయ్యప్పమాలలు ధరించడంతో కొంతమంది బారికేడ్లను తొలగించి వరద గోదావరిలో ప్రమాదకరంగా స్నానాలు ఆచరిస్తున్నారు.

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా గోదారి

అత్యవసర పరిస్థితుల్లో..

కలెక్టరేట్ కంట్రోలు రూమ్ 8977935611
రాజమండ్రి ఆర్డీవో ఆఫీస్ 0883-2442344
కొవ్వూరు ఆర్డీవో ఆఫీస్ 79953 67797
టోల్ ఫ్రీ నెంబర్లు 1070, 112, 1800-425-0101, 8333905022

ప్రజా రక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి : జేసీ

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జేసీ వై.మేఘస్వరూప్ తెలిపారు. గోదావరి వరద పరిస్థితిపై వివిధ శాఖల అధికా రులతో సమీక్షించారు. రెవెన్యూ అధికారులు బాధితులను సురక్షిత ప్రదేశాలకు తరలించి, సహాయక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, గస్తీపెంచాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు బ్యారేజి పర్యవేక్షణలో ఉండి, నీటిమట్టాల వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ,ఆర్ఎంసీ అధికారులు ఘాట్ల వద్ద బారి కేడింగ్ ఏర్పాటు రోజంతా పర్యవేక్షించాలని చెప్పారు.అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



గోష్పాదక్షేత్రానికి అడ్డుగా కట్టిన క్లాత్‌లు



అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లికి వైద్యుల వినతి

పీహెచ్‌సీల్లో ఓపీ బంద్

బిక్కవోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో సోమవారం ఓపీ సేవలు బంద్ చేశారు. రాష్ట్ర పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ పిలుపు మేరకు తమ డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్ చేశారు. అనపర్తి నియోజక వర్గం పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో నెం 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, సమయ నిర్ధారితమైన పదోన్నతుల కల్పించాలని, ట్రైబల్, 104 సంచార చికిత్స అల వెన్స్‌లు అందించాలని, నోషనల్ ఇన్‌క్రిమెంట్‌లు అందించాలని డిమాండ్ చేశారు. బిక్కవోలు, కొంకుదురు వైద్యులు దుర్గాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలిగిన సచివాలయ కార్యదర్శులు

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సచివాలయ కార్యదర్శులు వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలిగారు. సచివాలయ ఎంప్లాయాస్ ఫెడరేషన్ కొవ్వూరు పట్టణ అధ్యక్షులు ఎస్.కృష్ణభగవాన్ మాట్లాడుతూ ఏపీవీడబ్ల్యుఎస్ఈ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ పిలుపు మేరకు సోమవారం సచివాలయ కార్యదర్శులు బ్యాంకుల నుంచి పెన్షన్ అమౌంట్ డ్రా చేసుకుని వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలగడం జరిగిందన్నారు.ప్రభుత్వ ఉద్యోగులుగా మాకు అప్పగించిన విధులు నిర్వర్తించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వలంటీర్ విధులు మాకు అప్పగించడం బాధాకరమన్నారు. ఇంటింటికి తిరిగి క్యాంపెయినింగ్, డోర్ టు డోర్ సర్వేలు అప్పగించవద్దని నిరసన పోరాటం కొనసాగుతుందన్నారు. వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలగినా ప్రతీరోజు ఉదయం 10-30 నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనే ఉంటామన్నారు. అక్టోబరు 1న పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. మా డిమాండ్ల సాధనకు తుది వరకూ పోరాటం చేస్తామని తెలిపారు.



కోటసత్తెమ్మకు పూజలు

కోటసత్తెమ్మకు పూజలు చేస్తున్న చిన్నారులు



నిడదవోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయంలో మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంత్రం హోమం చేశారు. అమ్మవారికి నిర్వహించిన కుంకుమ పూజల్లో సుమారు 517 మంది దపంతులు పాల్గొన్నారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో సుమారు 1200 మంది విద్యార్థులచే సామూహిక సరస్వతీ పూజ నిర్వహించారు. దాతల సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మంత్రి కందుల దుర్గేష్ అమ్మవారికి చీర సారె సమర్పించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

నల్లజర్ల పోలీసుల మానవత్వం



మృతదేహాలను మోసుకొస్తున్న నల్లజర్ల ఎస్‌ఐ దుర్గా ప్రసాద్, సిబ్బంది

నల్లజర్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసులు అంటే ప్రజలు భయందోళన చెందుతారు. నల్లజర్ల మండల పోలీసులు మాత్రం ఫ్రెండ్లీ పోలీసు మాదిరిగా వ్యవహ రిస్తున్నారు. నిన్న పుల్లలపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భవానీల మృతదేహాలను ఎస్‌ఐ దుర్గాప్రసాద్ పంట బోదెలో నుంచి మోసుకుని వచ్చి పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూ డెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈదృశ్యాలను చూసిన స్థానికులు పోలీసుల సేవలను కొడియాడారు. కాలినడకన వెళ్లే భవానీ భక్తులకు ప్రతిరోజు తాగునీరు, ప్రసాదాలు, అల్పాహారం పోలీసులు అందించడం ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి దోహదపడుతోంది.

సరస్వతీదేవి అలంకరణలో అమ్మవార్లు

● వైభవంగా దేవీనవరాత్రి ఉత్సవాలు

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు సర్వస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మానేపల్లి సుందర గణేష్ ఆధ్వర్యంలో సోమవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని సర్వస్వతీదేవిగా అలంకరించారు. మహిళలు, చిన్నారులు సామూహిక సరస్వతీదేవి పూజలు చేశారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామదేవత కొవ్వూరుమ్మ అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు సర్వస్వతీదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్వస్వతీదేవిగా అలంకరించి విశేషపూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాకి అనిల్ సూర్య, కె. రాంబాబు, పెరుమాళ్ళ వీరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో కనకదుర్గమ్మ అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. విద్యార్థులచే సరస్వతీ పూజలు నిర్వహించారు. అన్నదేవరపేటలో ఆలయ అర్చకులు పెద్దింటి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజలు నిర్వహించారు. తాళ్లపూడి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అర్చకులు జంధ్యాల గంగాధరశర్మ ఆధ్వర్యంలో విద్యార్థులచే పూజలు నిర్వహించారు.

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరంలో బాలాత్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం సర్వస్వతి దేవి విగ్రహం వద్ద విద్యార్థులు సరస్వతిదేవి పూజలు చేశారు.



సరస్వతీదేవి అలంకరణలో జ్ఞాన సరస్వతి

గోపాలపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాదాలకుంటలో కుంతీదేవి, నందీశ్వరుడి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం రాత్రి నుంచి మొదలైన ఈ ఉత్సవాలు సోమవారం సాయంత్రంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా కుంతీదేవి, నందీశ్వరుడి పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. వాదాలకుంట ఊరచెరువులో నిమజ్జనం చేశారు.

చాగల్లు(ఆంధ్రజ్యోతి): చాగల్లు పాటిమ్మపేటలోని బాలకనకదుర్గమ్మ వారి ప్రాంగణంలో సోమవారం సరస్వతి పూజలు నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జ్ఞానసరస్వతికి పూజలుచేసి విద్యాబుద్ధులు ప్రసాదించాలని వేడుకున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలో భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా పూజలు జరిగాయి. వల్లిగుంటలోని శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయంలోను అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సెంటర్‌లోని శ్రీకన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోను మహిళ భక్తులు భగవద్గీత పారాయణం చేశారు.

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం అన్ని అమ్మవారి ఆలయాల వద్ద సరస్వతీ దేవిగా అలంకరించి ఉదయం నుంచి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో పూజాకార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు.



వాదాలకుంటలో కుంతీదేవి, నందీశ్వరుడిని ఊరేగిస్తున్న భక్తులు

మూడు బొమ్మల సెంటర్‌వద్ద సౌభాగ్యదుర్గాంబిక ఆలయంలో పల్లపువీధి రామాలయం వద్ద, వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న సరస్వతిదేవి ఆలయంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. దాతల సాయంతో, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు అందజేశారు.

గుబ్బాలమ్మకి మంత్రి పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం గోపవరంలో గుబ్బాలమ్మకి సోమవారం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ చీర సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గ్రామస్థులు మంత్రి దుర్గేష్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట ఆరేపల్లి చిన నంగాలు, పంచదార వెంకట దుర్గా ప్రసాద్, కూటమి నాయకులు దేవస్థానం అధికారులు ఉన్నారు.

మహిళలకు చేయూతనందించాలి



కత్తెరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాద్

పెరవలి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): మహిళలకు చేయూతనందిస్తే కుటుంబం బలపడుతుందని పెరవలి మండలం లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాద్ అన్నారు. సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వ ర్యంలో క్లబ్ అధ్యక్షుడు దేవరపు వెంకటరాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వంక రవీంద్రనాద్ చేతుల మీదుగా శిక్షణ పొందిన మహిళలకు కత్తెరలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు పంపిణీ చేశారు. పెరవలి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన శిక్షణ పొందుతున్న 133 మంది మహిళలకు కత్తెరలు పంపిణీ చేశారు. కత్తెరలకు సాయం చేసిన శ్రీస్పార్క్ సోలార్ కంపెనీ యజమానులు దేవరపు జయరాణి, యా తం రామకృష్ణలను అభినందించారు. అంగన్‌వాడీ సెంటర్‌లకు రెండు చొప్పున 18 కుర్చీలు అందించారు. కుర్చీలకు ఆర్థిక సాయం చేసినజోన్ చైర్‌పర్సన్ మాదిరెడ్డి కృష్ణకుమారి, రీజనల్ చైర్‌పర్సన్ అల్లూరి గౌరీరావులను అభినందించారు. కార్యక్రమంలో జెడ్‌పీ మా దిరెడ్డి కృష్ణకుమారి, ఆర్‌సీ అల్లూరి గౌరీరావు,పెరవలి ఎంపీపీ కార్చెర్ల సీతారామ్ ప్రసాద్, ఎంపీడీవో కెయుఆర్‌ఎల్ పద్మజ పాల్గొన్నారు.



అన్నదేవరపేటలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

మున్సిపల్ కార్మికుల నిరసన

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అనంతపురం, గుంటూరు నగరాలలో మున్సిపల్ కార్మికులపై అధికారులు, ప్రజా ప్రతినిధుల వేధింపులు, దాడులు అరికట్టాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు సుందరబాబు మాట్లాడుతూ అనంతపురంలో వాటర్‌సెక్షన్‌లో పనిచేస్తున్న గౌరీశంకర్‌పై అధికారులు అక్రమకేసు బనాయించి, ఉద్యోగం నుంచి తొలగించడం కుట్ర పూరితమన్నారు. గుంటూరు జిల్లాలో పారిశుధ్య కార్మికురాలు పద్మపై జనసేన కార్పొరేటర్ సభ్య సమాజం సిగ్గుపడేలా నీచంగా మాట్లాడడాన్ని ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్‌శాఖ మంత్రి జోక్యం చేసుకుని కార్మికులకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, వాసు, రాజేష్, శ్యాం పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా, మౌలిక వసతుల సంస్థ డైరెక్టర్‌గా వేణమ్మ బాధ్యతల స్వీకరణ

బిక్కవోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య మౌలిక వసతుల సంస్థ డైరెక్టర్‌గా విజయవాడలో సోమవారం బేరా వేణమ్మ ప్రమాణ స్వీకారంచేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్యకుమారి, సొసైటీ చైర్మన్ పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, కూటమి నాయకులు వైదాడి వెంకటేశ్వరరావు, బేరా శ్రీను, గోవిందు, రాయుడు రామచంద్రరావు, పల్లి రాజారెడ్డి అభినందించారు.

డీవీఎంసీలో సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల ప్రజలపై జరుగుతున్న అత్యాచార కేసుల పరిశీలన, నివారణ చర్యలకు సంబంధించి తూర్పుగోదావరిజిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ(డీవీఎంసీ)లో ఇతర కులాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు ఎన్‌జీవో సభ్యులను జిల్లా కమిటీకి ఎంపిక చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎండీ గయాజుద్దీన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎస్సీ, ఎస్టీలు సంబంధించిన వారు కాని ఎన్‌జీవోల్లో ఆసక్తి కలిగిన వారు అక్టోబరు 7వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చని ఆయన తెలిపారు.

గోదావరి పుష్కరాలకు శాఖల వారీగా
ప్రతిపాదనలు అందించాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలకు శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధంచేసి అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రాజమహేంద్రవరానికి ప్రాధాన్యంనిస్తుందని, గోదావరి పుట్టుకకు కారణమైన కొవ్వూరును చిన్నచూపు చూస్తుందన్నారు. కొవ్వూరు గోదావరి తీరం గోష్పాదక్షేత్రానికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి పుష్కరాలో కొవ్వూరుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ గోదావరి పుష్కరాలలో చేపట్టాల్సిన పనులకు సీనియర్లు, అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు,దేవాలయాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడు తూ మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ రాజమహేంద్రవరం వచ్చినప్పుడు కలిసి కొవ్వూరు మున్సిపాల్టీ అభివృద్ధికి రూ. 4 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరామని, దానికి ఆయ న స్పందిస్తూ రూ.2 కోట్లు అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు. 2027లో రానున్న గోదావరి పుష్కరాలకు తాడిపూడి నుంచి విజ్జేశ్వరం వరకు సుమారు 35 కిలోమీటర్ల మే ర అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది. రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీరు, స్నానఘట్టాలు, ఆసుపత్రులు అన్నిశాఖల అధికారులు శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించినట్లయితే ప్రభుత్వానికి అంద జేసి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నా రు. పట్టణాభివృద్ధికి పార్టీకతీతంగా టౌన్‌లోని 23వార్డుల కౌన్సిలర్లు తమ,తమ వార్డులలో అవసరమైన అభివృద్ధి పనులపై రాత పూర్వకంగా అందజేయాలన్నారు. రానున్న పుష్కరాలకు ముందే కొవ్వూరు రైల్లేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా కొవ్వూరు ఆర్టీసీ డిపో మూసివేసి మరలా తెరచిన సందర్భంగా ఇతర డిపోలలో పనికిరాని బస్సులను కొవ్వూరుకు పంపించారు. కొవ్వూరు డిపో పరిధిలోని గ్రామాలకు బస్సు సర్వీసులు పునరుద్ధరణ చేయాలన్నారు. మండలంలోని నందమూరు, పశివేదల రోడ్డు నిర్మాణ పనులను రెండు రోజులలో ప్రారంభిస్తారన్నారు. పుష్కరాల నాటికి 100 శాతం రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తిచేసేలా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

డాక్టర్ జొన్నకూటికి సాహిత్య కిరీటి పురస్కారం


సాహిత్య కిరీటి పురస్కారం అందుకున్న డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్

తాళ్లపూడి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని పైడిమెట్ట గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సామాజిక సేవా కార్యకర్త, ఉపాధ్యాయుడు అయిన డాక్టర్ జొన్నకూటి ప్రమో ద్‌కుమార్ సాహిత్యకిరీటి పురస్కారాన్ని ఆదివారం అందు కున్నారు. ఈ సందర్భంగా జొన్నకూటి మాట్లాడుతూ ఐఎస్‌వో సర్టిఫికెట్‌తో పాటు 36 ప్రపంచ రికార్డులు సాధించిన సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక 155వ కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరి యంలో సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉభయ రాష్ట్రాలలోని 150 మంది కవులకు, రచయితలకు సాహిత్య కిరీటి పురస్కారాన్ని అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ కార్యదర్శి డా. టి.పార్థసారధి, జాతీయ మహిళా విభాగ అధ్యక్షురాలు జి.ఈశ్వరీభూషణం ఈ అవార్డును అందుకున్నారని ప్రమోద్ కుమార్ తెలిపారు.

'గుండెను ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలి'

దేవరపల్లి, సెప్టెంబరు 29(ఆం ధ్రజ్యోతి): మనిషి శరీరంలో గుండె ప్రధానమైన భాగమని దీన్ని ప్రతీఒక్కరు పరిరక్షించుకోవాలని మండల టీడీపీ నాయకులు ఆండ్రూ అనిల్ పేర్కొ న్నారు. దేవరపల్లిలో సోమవారం సుమంత్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండ్రూ అనిల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మల్టీస్పెషాలిటీ వైద్యం అందిస్తున్న డాక్టర్ సుమంత్‌ను ఆయన అభినందించారు. ఉచిత మెడికల్ క్యాంపులు పెట్టి పేదలకు వైద్యం అందించి మందు లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా తమ ఆసుప త్రిలో గత మూడురోజుల నుంచి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి 15విభాగాలకు చెందిన వైద్యనిపుణులతో ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామని తెలిపారు. గుండె ప్రాధాన్యం వివరిస్తూ దేవరపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి చైతన్య స్కూల్ వరకు భారీ అవ గాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కడియం సూర్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు పెనుమత్స సుబ్బరాజు, లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు పెందుర్తి రామరహిత, టీడీపీ నాయకులు దుర్గారావు, ముళ్లపూడి సత్యనా రాయణ, బల్లా సూర్యచక్రం, పీఎంపీల అసోసి యేషన్ అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు, తద తరులు పాల్గొన్నారు.

పశివేదల సొసైటీ సభ్యులకు 15శాతం డివిడెండ్ పంపిణీ

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పశివేదల సొసైటీ సభ్యులకు 15శాతం డివిడెండ్ చెల్లిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు తెలిపారు. కొవ్వూరు మండలం పశివేదల రంగరాయ విశాల సహకార పరపతి సంఘం మహాజన సభ సోమవారం సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి కరుటూరి శ్రీనివాసరావు వార్షిక నివేదికను వివరించారు. ఈ సందర్భంగా గారపాటి రామచంద్రరావు మాట్లాడుతూ 2024-25కి సొసైటీ రూ.1,69,18,219ల నికరలాభం రావడంతో సంఘ సభ్యులకు 15శాతం డివిడెంటు చెల్లించుటకు తీర్మానించారన్నారు. అనంతరం సొసైటీ సభ్యులు, రైతులు అడిగినప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. కార్యక్రమంలో గారపాటి శ్రీనివాసరావు, బేతిన నారాయణ, సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు

రైతుల సంక్షేమం కోసం కృషి: సొసైటీ చైర్‌పర్సన్


సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు

దేవరపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం సహకారపరపతి సంఘం కృషి చేస్తుందని సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు పేర్కొన్నారు. దేవరపల్లిలో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సాధారణ మహాజనసభ సొసైటీ చైర్ పర్సన్ ఉప్పులూరి రామారావు అధ్యక్షతన జరిగింది. రామారావు మాట్లాడుతూ 2024-25కి సంఘానికి 42కోట్ల 14లక్షల 312 రూపాయలు లాభాలు ఆర్జించిందని రైతులకు 15శాతం డివిడెంట్లు ప్రకటించామన్నారు. సొసైటీ పాత గొడౌన్ ను తొలగించి కొత్త గొడౌన్ నిర్మించడానికి కృషి చేస్తామ న్నారు. సొసైటీ స్థాపించి వచ్చే ఏడాదికి 100ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సంఘ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేడపతున్నట్లు తెలిపారు. కార్యదర్శి కల్లూరి శ్రీనివాస్ శర్మ, సంఘం వార్షిక నివేదికను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కవల సీతారత్నసూర్య కుమారి, తంగెళ్ల శ్రీను, స్థానికులు పిచ్చుకల గోవిందరావు, దుగ్గిన సూర్యచంద్రం, కాట్రు భీమరాజు, పరిమి శ్రీరామకృష్ణ, దొరయ్య, కాట్రగడ్డ మోహన్, పాల్గొన్నారు.

రంగంపేటలో డ్రైనేజీ ఆక్రమణల తొలగింపు

రంగంపేట,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రంగంపేటలో పలువురు డ్రైన్లను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో ఇళ్లలో వాడకం నీరు, వర్షపునీరు ప్రవహించక గ్రామస్థులు అనేక ఇబ్బందు పడుతున్నట్టు పంచాతీయతీ కార్యదర్శి వి.శ్రీరామమూర్తి దృష్టికి వచ్చింది. దాంతో సోమవారం డ్రైన్ల ఆక్రమణలను తొలగింపు ప్రారంభించారు.



డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 8 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అధికారులను ఆదేశించారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 8 ఫిర్యాదులను స్వీకరించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రతీ సోమవారం మండల, డివిజన్, జిల్లాస్థాయిలలో పరిష్కారవేదికలు ఏర్పాటుచేసి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. మండల, డివిజనల్ కార్యాలయాలతోపాటు ఆన్‌లైన్‌లో 1100 కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కారంలో అలసత్వం తగదన్నారు. ఒకసారి స్వీకరించిన ఫిర్యాదులు క్షేత్రస్థాయిలో పరిష్కరించి, మరలా అదే సమస్యపై ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చెక్కుల పంపిణీ


చిరు వ్యాపారులకు చెక్కులు అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక్ కళ్యాణ్ మేళా ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చిరు వ్యాపారుల అభివృద్ధికి బ్యాంకుల ద్వారా ఇస్తున్న రుణాలను చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులకు లోక్ కళ్యాణ్ మేళాలో పలువురు చిరు వ్యాపారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ పీఎం స్వానిధి ద్వారా ఇస్తున్న రుణాలను చిరువ్యాపారులు బ్యాం కులకు సకాలంలో రుణాలు చెల్లించి మరిన్ని ఎక్కువ రుణాలు పొంది వారి భవిష్యత్‌ను దిద్దుకోవాలన్నారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై ఆయన చర్చించారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

లోక్ కల్యాణ్ మేళా పథకాలను వినియోగించుకోవాలి

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన వీధి విక్రయదారులకు లోక్ కల్యాణ్ మేళా సదస్సు నిర్వహించి డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. వీధి వ్యాపారులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ బావన రత్నకుమారిలు ఆరోగ్యకార్డులు పంపిణీ చేశారు. ఈ పథకంలో పి.యం. స్వానిధి కింద మొదటిసారి రుణం తీసుకునే వారికి రూ.15వేలు, రెండవ విడత రూ. 25 వేలు, మూడవ విడత రూ.50వేలు ఇస్తామన్నారు కార్యక్రమంలో సూరపనేని చిన్ని, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు, మున్సిపల్ కమిషనర్ జి.సందీప్, టీఎంసీ జెవివిఎస్.భవాని, టిఎల్ఎఫ్ ప్రెసిడెంటు ఎం.రత్న, పి.శ్రీదేవి, సివోలు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని ఔరంగాబాద్‌కు చెందిన మట్టా ఆనందరావు(31) ఈనెల 28న రాత్రి 12-30 సమయంలో స్నేహితుడిని బైక్‌పై తీసుకుని కొవ్వూరు శ్రీనివాసపురంలో దింపి తిరిగి వెళ్తుండగా కొవ్వూరు టోల్‌గేటు వద్ద పెట్రోల్ బంకు సమీపంలో రాజమహేంద్రవరం నుంచి దొమ్మేరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో గాయాల య్యాయి. గాయపడిన ఆనందరావును అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య శిరీష అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

వడ్లూరులో వైద్య శిబిరం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లూరులో స్వస్థ నారి-స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టరు ఆర్. ఉషాదేవి రోగులకు పరీక్షలు జరిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలకు సంబంధించిన వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు.

రైతులకు మరిన్ని సేవలు అందించాలి


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

చాగల్లు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా సొసైటీలు పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఊనగట్ల సొసైటీ మహాజన సభ సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివ నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సొసైటీ కార్యదర్శి కేతనపల్లి శ్రీనివాసరావు వార్షిక నివేదికను సభకు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.17,19,063 లాభం ఆర్జించిందని సంఘ బైలాప్రకారం సభ్యులకు పంపిణీ చేశారు.

500 మందికి వైద్య పరీక్షలు

అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సొసైటీ ఆవరణలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 20మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. వంద మందికి కళ్ళజోళ్లు అవసరమని గుర్తించి సొసైటీ ఆర్థిక సహాయంతో అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. నిడదవోలు శ్రీరాజేశ్వరి రామకృష్ణన్ నేత వైద్యశాల వైద్యులు, మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలలోని డాక్టర్లు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ అళ్ళ హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏ మోనిటరింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయ వాదులతో సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి సోమవారం మోనిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించడానికి నియమితులైన న్యాయవాదులతో కేసుల పురోగతిపై చర్చించారు. క్రిమినల్ కేసులు, బెయిల్ పిటిషన్లపై ఆరా తీశారు.

పశువుల దాణా పంపిణీ

పెరవలి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పాడి పశువుల రైతులకు 50శాతం సబ్సిడీపై పశు దాణా పంపిణీ చేసినట్లు మాజీ ఎంపీపీ కోటిపల్లి మురళీకృష్ణ అన్నారు. పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామంలో సోమవారం రైతు భరోసా కేంద్రంలో పాడి పశువులకు దానా పంపిణీ చేశారు 38 మంది రైతులకు 1100 రూపాయలకు బస్తాకు రూ.550కుగాను సబ్సిడీపై ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ సల్మా, వెటర్నరి అసిస్టెంట్ రాజేష్, రైతులు పాల్గొన్నారు.